# విషయసూచిక


| | | |
|---|---|---|
| జీవనమంతయు... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| విలియంకేరి... | ఆండ్రూస్ దావల, గుంటూరు | 4 |
| జకర్యా | కొడవటికంటి | 6 |
| సువార్తికుడిగా జాన్‌దేవిడ్ | అరుణ్‌కుమార్ కె. మహంతి, సి.హెచ్.పేట | 7 |
| 13 వ వార్షికోత్సవం | ఎడిటర్ | 9 |
| యోగ్యురాలు | శ్రీమతి డి. పరిశుద్ధం, ఒంగోలు | 11 |
| కొడవటికంటి రచనలు | డెస్క్ | 12 |
| వేదముల సాక్ష్యము | వి.జె. పట్నాయక్, జాయింట్ డైరెక్టర్, అగ్రికల్చర్ (రిటైర్డ్) | 13 |
| సెప్టెంబరు నెల ప్రశ్నలు | శ్రీ పంతగాని గ్రేషియస్ , ఏలూరు | 15 |
| విశ్వాసమే... | కొడవటికంటి | 18 |
| పరలోకము - నరకము | జాలాది అన్నమ్మ జోసఫ్, ఒంగోలు | 20 |
| నా స్వప్నము | లియోటాల్‌స్టాయ్ | 23 |
| యేసుకథ | కొడవటికంటి | 28 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |



**కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

చీఫ్ ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ - 51, డోర్ నెం.54-1-23(ఎ)

కృపాదానంవీధి, క్లౌపేట, ఒంగోలు-523 001

9866716506


**సంవత్సర కానుక : రూ. 200/**


ఆన్‌లైన్ అకౌంట్ నెం. : **10957294362**

బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అకౌంట్ హోల్డర్ : కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లౌపేట, ఒంగోలు

సెల్ : 9866 716 506


# HANNA KRUPA®

## Christian Devotional Monthly Magazine


సంపుటి : 13 సంచిక : 3/2012

**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

క్రమ సంఖ్య : 123



Editor :

**Rev. Nathaniel R.Kodavatikanti**

Gen Secretary,UCLI.Ongole B.Th.,M.A.,M.Phil

Hon. Editor :

**Rev. K. Vijaya Chandra**

Hannahkrupa Memorial Church, Bangalore

Hon. Advisor :

**Sri. Yadavalli Prasada Rao**

Pay & Accounts Officer, Hyderabad

Patrons :

**Dr. Y.S. Purushotham Reddy**

Spdt, Sri Rajareddy Hospital, Pulivendula

**Sri. M.Shalem Vikranth Vardhan**

Director, Good News Messengers, Guntur

**Dr. Pikkili Hussenaiah**

Sri Parvathi Nursing Home, Besthavaripeta

**Smt. Mahasamudram (Katta)**

**Nageswari Bhaskar, M.Sc., H.Sc.,Hyd.**

**Smt. K. Victoria Rukmini,** B.A.,B.Sc,B.Ed. Rtd.H.M.,Markapuram

**Dr. Z.C. Devadanam,** Former Treasurer

National Council of Churches in India, Kurnool

**Office Incharge :** K. Vani Jessi

# జీవనమంతయు...

యేసుప్రభువు ఇంకా రెండు రోజులకు శిలువ మరణము పొందవలసిన సమయము సమీపించినపుడు మత్తయి సువార్త 25వ అధ్యాయములోని ఉపమానములు, పరలోక రాజ్యమును గురించినవి చెప్పాడు.

మొదట దివిటీలు పట్టుకొని పెండ్లి కుమారునికై ఎదురుచూచిన పదిమంది కన్యకల విషయం చెప్పి – ఎవని సామర్థ్యము చొప్పున వానికి – ఒకనికి అయిదు, ఒకనికి రెండు, ఒకనికి ఒక తలాంతు ఇచ్చిన సంగతి చెప్పి, తన మహిమతో మనుష్యకుమారుడును ఆయనతో కూడా సమస్త దూతలును వచ్చునపుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడైయుండును. అప్పుడు సమస్త జనులును ఆయన యెదుట పోగుచేయబడుదురు. గొఱ్ఱెల కాపరి మేకల్లో నుండి గొఱ్ఱెలను వేరుచేసినట్లు వాళ్ళను వేరుచేస్తాడు. తదుపరి కొందరిని తన కుడివైపున, కొందరిని తన ఎడమవైపున ఉంచుతాడు.

అప్పుడాయన తన కుడివైపున ఉన్నవారితో 'రండి! నా తండ్రి ఆశీర్వాదాలను మీరు పొందారు. మీ రాజ్యాన్ని తీసుకోండి. ప్రపంచం సృష్టించబడినప్పుడే ఈ రాజ్యాన్ని దేవుడు మీ కొరకు ఉంచాడు. ఎందుకంటే నేను ఆకలిగా ఉన్నప్పుడు మీరు నాకు భోజనం పెట్టారు. దాహం వేసినపుడు మీరు నాకు నీళ్ళిచ్చారు. పరదేశీయునిగా మీ దగ్గరకు వచ్చినపుడు నాకు ఆతిథ్యమిచ్చారు. దుస్తులు కావలసివచ్చినపుడు మీరు నాకు దుస్తులిచ్చారు. జబ్బుతో ఉన్నప్పుడు మీరు నాకు సేవచేశారు. నేను కారాగారంలో ఉన్నప్పుడు వచ్చి పలకరించారు అని అంటాను' అని యేసుప్రభువు చెప్పాడు.

అంటే మనం మరణించిన తర్వాత గాని అంతిమ తీర్పుకై దేవుని యెదుట మనం నిలబడినప్పుడు ఆయన (దేవుడు) తీర్పు తీర్చే చట్టము (లా) నేరుగా మనం చూస్తున్నాము. క్రైస్తవుడా? లేక హిందువుడా? లేక మన మతం ఏమిటి? మారుమనస్సు పొందామా? ఉపవాస మున్నామా? ప్రార్థన చేశామా? అని కాదు గాని మన క్రియలు, తోటి మానవుల యెడల మన ప్రవర్తన ఎలా ఉన్నది? ఆకలిగొన్నవారికి అన్నము, దాహమైనవానికి దాహము, పొరుగూరివారికి ఆతిథ్యము, వస్త్రహీనునికి వస్త్రం, రోగిని పరామర్శించి, చెరలోనివారికి ఓదార్పు ఇచ్చామా లేదా? ఇచ్చినా అది హృదయపూర్వక మైనదా? లేక మరేదైనా ఆశించి మనం ఆ పనులు చేశామా?

ధనవంతుడు – లాజరు ఉపమానములో ధనవంతుడు ఏ రకమైన పాపము చేసి నరకంలో ఉన్నాడో బైబిలు చెప్పలేదు. కాని అబ్రాహాము ధనవంతునితో 'కుమారుడా! జ్ఞాపకం తెచ్చుకొనుము, నీవు బ్రతికిన రోజుల్లో సుఖాలను అనుభవించావు. లాజరు కష్టాలను అనుభవించాడు' అన్నాడు. ఈ లాజరు ధనవంతుని ఇంటి గడప ముందు పడి ఉన్ననాడు – తన కండ్ల ఎదురుగా ఉన్న ఆకలిగొని, దప్పిక చెంది, వస్త్రహీనునిగా ఉన్న లాజరును ధనవంతుడు గమనించకపోవడం అతనిని నరకానికి చేర్చింది.

భక్తి, పట్టుదల కలిగిన క్రైస్తవ్యత్వము – పరలోకము లోనికి మనలను చేర్చాలంటే తప్పక మత్తయి సువార్త 25లోని తీర్పును మనం గమనించాల్సిందే! ధనవంతులుగా ఉండడం పాపము కాదు. గాని మన ధనములో ఎంత భాగము ఇతరుల ఆకలిదప్పులకు, వస్త్రహీనతకు, రోగముల విముక్తికి, ఖర్చుచేస్తున్నామో దేవుడు చూస్తున్నాడు.

ఒకరోజు పరాయి పట్టణంలో నివశించడానికి లాడ్జిలో రూము తీసుకోవడానికి మరొక దైవజనుడు నన్ను ఆహ్వానించాడు. ఖర్చు అతనిదే! ఇద్దరికి ఆ రూము అద్దె ఎనిమిది వందలు. నేను ఆ లాడ్జిలోనికి రానన్నాను. ఖర్చు అతనిదే. ఒకరోజు విశ్రాంతికై ఎనిమిది వందలు చెల్లించడం న్యాయమా? నాకంటే దేవుని ఎక్కువగా ప్రేమించే ప్రభువు బిడ్డలకు ఆ ఎనిమిది వందలు ఇచ్చి ఎక్కడైనా ఓ చర్చిలో కాలం వెళ్ళబుచ్చితే అదెంత భాగ్యము? అనుకొన్నాను.

తర్వాత కొంత కాలమునకు వందల్లోను, వేలల్లోను

**తరువాయిభాగం 22వ పేజిలో**

# విలియం కేరి - మహనీయ జీవితం

రచన – ఆంద్రూస్ దావల

అటూ ఇటూ నదులతో పాటు మధ్యగా ప్రార్థనా స్థలిగా పనికివచ్చే ఒక విశాలమైన హాలు ఉంది. ఆ ఇంటినే అంటిపెట్టుకున్న ఖాళీస్థలాన్ని లీజుకు తీసుకొని కప్పున్న చోట ముద్రణాలయాన్ని, బహిరంగ ప్రదేశాన్ని కేరి కోరిక మేరకు ఉద్యానవనంగా అభివృద్ధి చేయడానికి ఉపయో గించారు.

మిషెనరీలందరూ కుటుంబంతో సహా అక్కడే నివసించేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి. వేర్వేరు గదుల్లో నివసిస్తున్నా భోజన పానాదులు సామూహికం. ఎవరెలా ధనం సంపాదించినా అదంతా ఒకే గూటిలో జమవుతుంది. పథకం మేరకే ఖర్చవుతుంది.

సెరంపూర్ త్రయంగా పేరొందిన విలియంకేరి, విలియం వార్డ్, జాషువా మార్ష్‌మన్ తమ విధులను పంచుకొని విడివిడిగా పనులు చేసుకుపోతున్నా, వారానికో సారి "మిషన్ చర్చ్"లో కూర్చుని వారి విధులలోని కష్టసుఖాలు, భవిష్యత్ ప్రణాళికలు చర్చించుకునేవారు. వార్డ్ కేవలం ముద్రణాలయ పర్యవేక్షకునిగా, మార్ష్‌మన్ భార్య హేనాషెప్పర్డ్ సృజనాత్మక శక్తిగలదై అత్యంత కమనీయ వరాలు పొందిన మహిళ. మార్ష్‌మన్‌కు, ఆ మాటకొస్తే కేరి మిషనెరి ఉద్యమానికి ఆమె ఒక పట్టుగొమ్మగా పరిచర్య చేసింది.

ముగ్గురూ కలిసి తమ ఉద్యమానికి ఒక స్థిరమైన ప్రణాళికను రూపొందించుకొని ఆ ప్రణాళిక మేరకు నిర్విరామ కృషిచేశారు.

1. కేరికి ప్రీతికరమైన బైబిలు అనువాదం
2. సువార్త సేవ
3. బైబిలు కళాశాల నొకదానిని స్థాపించి బోధకులను, సువార్తీకులను తయారుచేయడం.

వీటి సాధనకు పునాదిగా భారతీయ భాషల అధ్యయనంలోను, ఆచార వ్యవహారాలు అవగాహన చేసుకోవడంలోను, హిందూమత ధర్మాన్ని పరిశోధించడం లోను విశేష కృషిచేశారు.

**బోధకుడిగా కేరి :** విలియం కేరి బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రజ్ఞ – జన్మతః సంక్రమించే మంచి లక్షణం. ఆ లక్షణం గలవారు, ఊరికే నిర్వీర్యంగా కూర్చొని జీవితం గడపలేరు. వారు పేదరికాన్ని అధిగమించగలరు. కష్టాల్ని భరించగలరు. హింసాత్మక ధోరణిని సహించగలరు. వారికావలసింది గురివైపు పయనించడం, తలపెట్టిన కార్యం సాధించడం. ఆ కోవకు చెందినవాడే విలియం కేరి.

లేకుంటే జన్మతః నిరుపేద! పేదరికం మూలంగానే పై చదువులు మానివేశాడు. ఏ అండా ఆదరవూలేనివాడు. అయినా మూడేళ్ళ జీవిత పయనంలో ఎన్నో అద్భుతాలు చేయగలిగాడు. అసాధ్యమైన కార్యాలు సాధించాడు.

బోధించడం ఆయన తపన. క్రీస్తునెరుగని వారికి దేవుని ఉనికిని ఎరుకపరచడం కేరి ప్రవృత్తి. ఆ విషయం బోధించడానికి, దేవుని వాక్యాన్ని ప్రబోధించడానికి సముద్రాలు దాటివచ్చి కానిదేశంలో స్థిరపడి ఆ దేశమే, తన దేశంగా నిలచిపోయాడు. ఓడ దిగిందే తడవుగా కలకత్తా వీధులకెక్కాడు. చుట్టూ మూగిన బెంగాలి జనం. ఒక విదేశీయుడొచ్చి తమ భాషలో స్పష్టంగా మాట్లాడడం విని విస్తుపోయారు. ఆయన చెప్పేది కొత్తగా ఉన్నా, వాస్తవ దూరం కాదనిపించింది. అసలది బోధకాదు, నచ్చజెప్పాడు అంటే బాగుంటుంది.

"నాలాగే మీకు దేవుడు కావాలి. కాని నాకు తెలిసిన దేవుడెవరో నన్ను రక్షించిన ఆ దేవుడెవరో మీకు తెలియజేయడానికే ఇంతదూరమొచ్చాను. దేవుని విషయంలో మీరు అపోహలో పడిపోతున్నారు. నిస్పృహను భరించలేక, నిరాశకు తట్టుకోలేక, రాళ్ళకూ, రప్పలకూ, చెట్లకూ, గుట్టలకూ అవిశ్రాంతంగా పూజలు చేస్తున్నారు. వాళ్ళు దేవుళ్ళు కారు.

మీ అమాయకత్వానికి అయోమయానికి మాత్రమే ప్రతీకలు. వాటికి ఆస్తిత్వం లేదు. దేవుళ్ళంటానికి ఆధారాల్లేవు. దేవుడు ఒకడే. ఆ దేవుడే ఈ సృష్టికి మూలం. ఆ సృష్టిలోని విడిభాగాలే మీరు సృష్టించిన వాడెవరో

తెలియక, అర్థంలేని పూజలతో, ఆటిరాని పురస్కారాలతో జీవితాన్నే వృధా చేసుకుంటున్నారు. రక్షణ భాగ్యం పొంద కుండానే నశిస్తున్నారు. నిజదేవుడెవరో తెలుసుకోకుండా, నిష్ఫల ఆధారాలతో, నమ్మకాలతో విలువైన కాలాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు.

మనకు దేవుడున్నాడు ఆయనే యేసుక్రీస్తు. ఆయనకు అభిముఖంగా మీరు నిలబడాలని ఆయన తహ తహలాడుతున్నాడు. ఆయనను మీరు తెలుసుకోవాలని ఏళ్ళ తరబడి నిరీక్షిస్తున్నాడు. ఆయనకు మీలో చోటివ్వండి. అప్పుడు మీరు మహదానంద జీవితం జీవిస్తారు" ఇలా సాగిపోతుంది కేరి ప్రబోధం. ప్రజలకు యేసే రక్షకుడని అతి తరచుగా ఆయన పలికే పదం. ఆయన వ్రాసే ఉత్తరాల్లోనూ, చేసే ప్రసంగాలలోను, సంభాషణల్లోను, రచించే గ్రంథాల్లోను రక్షకుడైన యేసు అనే పదం పలుమారు వాడబడుతుండేది.

ధర్మతల్లా మొదలుకొని, బౌబజార్, శేఖర్ బజార్... అలా అలా కలకత్తాలో ఏ వీధి ఆయన వదిలిందేలేదు. ప్రతి మనిషినీ పలుకరించి, యేసుక్రీస్తుని గురించే చెప్పాలని, ఆయన పథకం. యేసుక్రీస్తు ప్రేమ, సిలువ త్యాగం, ప్రధాన ఇతివృత్తాలుగా ఆయన ప్రసంగాలు కొనసాగాయి. యేసుక్రీస్తును గూర్చి ఆయన పలికే పదాలకు, ప్రసంగాలకు రాళ్ళయినా కరిగితీరుతాయనిపించేది. అది ఆయన వాగ్ధాటికున్న శక్తి.

క్రీస్తు కొరకు అగ్ని స్థంభాలుగా నిలబడిన ఆది అపోస్తులుల అడుగుజాడలలో నడిచిన కేరి, తానూ ఒక అగ్నిజ్వాలగా రూపెత్తి ప్రజల ముందు నిలిచేవాడు. సువార్త దీపం, భారతదేశం నలుచెరుగులా వెలగాలని విలియం కేరి ఆశ. **సువార్తను ప్రకటించని యెడల నాకు శ్రమ** అంటూ వృధా అయిన సమయానికి వాపోయేవాడు.

బోధించడం ఆయనకు బాల్యంలోనే అలవడింది. యవ్వనంలో – నార్తాంప్ షైర్, మోల్టన్, లీసెస్టర్ మొదలైన పట్టణాల్లో ఆయన చేసిన ప్రసంగాలు ప్రఖ్యాతి గాంచాయి. నార్తాంప్‌షైర్ ప్రసంగం, ఆంద్రూ ఫుల్లర్ లాంటి పెద్దల మన్ననలు పొందింది. నాటింగ్‌హోమ్ ప్రసంగం దేశవ్యాప్త మయింది. ఆయన మాటలు ఆధ్యాత్మిక మాధుర్యాలు. పదోచ్ఛారణ అమృత జల్లులే కురిపిస్తుంది.

## "దేవుని నుండి గొప్ప కార్యాల కోసం ప్రతీక్షించు దేవుని కోసం అరుదైన కార్యాలు సాధించు"

అంటూ కేరి నిర్మాణం చేసిన సూక్తి, విశ్వవ్యాప్తం కావడమేగాకుండా మిషనెరీలకు, బోధకులకు సువార్తికులకు ఆదర్శప్రాయమైంది. కేరి ప్రసంగాలు, సూక్తులు బాప్టిస్ట్ మిషనెరి సొసైటి వృక్షానికి విత్తనాలుగా జేమ్స్ కార్లూస్ అనే భక్తుడు అభివర్ణించాడు.

బెంగాలీ భాషలో ఆయన వేదికలెక్కి వీధులలో చేసిన ప్రసంగాలు ఎందరో సామాన్యప్రజల్ని ఆకట్టుకున్నాయి. 1804లో గవర్నర్ జనరల్ అధ్యక్షతన, ప్రభుత్వ భవనంలో బెంగాలీ భాషలో చేసిన ప్రసంగం పండితుల విస్మయానికి దారితీసింది.

ఈస్టయిన్ అనే శ్రోత, కేరి ప్రసంగం విన్నాక ఇలా వ్రాశాడు. "కేరి ప్రసంగాలు కేవలం 'యేసుక్రీస్తు' అనే పదం చుట్టూ పరిభ్రమిస్తాయి. అందులో ఉజ్జీవ ముంటుంది. శ్రోతల ఆసక్తి రేకెత్తించి, అలజడి రేపుతుంది. నిస్సార ప్రసంగాలు ఆయన ఏనాడు చేయలేదు. ఆయన ప్రసంగాలు, అన్నిటినీ తొలగదోసుకొని సరాసరి ఆత్మను తాకేవి. అయస్కాంతంలా శ్రోతల్ని ఆకర్షించేవి. ఆయన ప్రసంగానికి, సాధారణం, అసాధారణం అనే అంశాలుండవు. ప్రతి విషయమూ అత్యంత శక్తివంతమైన ఇతి వృత్తమే. అవి గాలిలో తేలిపోవు. బలవత్తరమైన పొందికతో భావ గర్భితంగా, అనుదిన జీవితంలో ఆచరణయోగ్యంగా ఉండేవి."

విలియంకేరి ప్రసంగాలలో ఉపమానాలుండవు. కవిత్వముండదు. అయినా సెలయేటిధారలా జారిపడి శ్రోతల్ని ఆపాదమస్తకం భక్తిభావంతో నిలువెల్లా తడుపు తాయి. క్రీస్తును ఎరుగనివారికి, ఆయనను తెలియజేయడం కేరి ఉద్యమం. అందుకు ఆయన ప్రసంగాలు పదునైన అరకలుగా పనికొచ్చాయి.

# జకర్యా

జకర్యా – గ్రంధ రచయిత పేరు. యెహోవా జ్ఞప్తి యుంచినవాడు అని అర్థము. ఇతను బెరక్యా కుమారుడు ఇద్దోకు మనుమడు. బబులోను చెరనుండి కోరెషు రాజు ఆజ్ఞ ప్రకారము యెరూషలేమునకు ప్రయాణమైన రాజ వంశీయుడైన జెరుబ్బాబెలును యాజకుడైన యెహోషువ తోను యెరూషలేము వచ్చిన వారిలో జకర్యా ఒకడు. (నెహెమ్యా 12:1,4,7) యాజకులకు సంబంధించిన వారిలో ఒకడైయున్నాడు. ప్రవక్తయైన హగ్గయికి సమకాలీను డైనను హగ్గయి ప్రవచనాలకు రెండు సంవత్సరముల తర్వాత ఇతడు ప్రవచించాడు. క్రీ.పూ. 520.

ఇతని గ్రంధమును రెండు భాగాలుగా విభజించారు. (1నుంచి8, 9నుండి14) ప్రవచనములలోని నడకలోను చాలాబేధము కనబడుతుంది. కనుక ఈ పుస్తకమును ఇద్దరు కాని మరికొందరు కాని వ్రాసినవని కొందరు చెబుతారు. అలాకాక మొత్తం జకర్యాగారి ఒక్కరికే ఆపాదించేవారు, మొదటిభాగము ప్రచురమైన చాలా సంవత్సరాలకు రెండవ భాగము వ్రాయబడినదని చెబుతారు. మొదటిభాగము చారిత్రాత్మకమైనది. రెండవభాగము ఆధ్యాత్మికమైనది. అందువలన రెండు, రెండు రకముల శైలిలో మనకు కనబడతాయి.

ఆయన ప్రవచనాలలో మొదటిగా యెరూషలేము దేవాలయమును కట్టుట గురించి చెబుతాడు. కొంత కాలముగా కట్టుబడి ఆగిపోయినందున ప్రజలు దేవాలయపు పని ప్రారంభించమని పురికొల్పే ప్రవచనాలు చెప్పాడు. తరువాత ముందు రాబోయే సంవత్సరములలో జరిగే విషయములను చెప్పాడు. తన సమకాలీనుడైన హగ్గయి సరళమైన భాషలో, జకర్యా – దానియేలు యెహెజ్కేలు గ్రంధములో వ్రాయబడిన బబులోను భాషలో చెప్పాడు. చాలాసార్లు ఆయన ప్రవచనాలను అర్థం చేసుకోవడానికి కష్టపడవలసి వస్తుంది. అయినను ముఖ్యాంశములు ప్రారంభములో సరళమైనవిగానే ఉన్నవి. అవి దానియేలు గ్రంధములో తప్ప మరే గ్రంధములోను చెప్పబడనివి. దూతల సమూహ మర్మములు ఇతని గ్రంధములో చెప్పబడినవి.

ప్రారంభములో ప్రజలు పశ్చాత్తాపపడి, తమ పితరుల నడతలను మాని వారికి వచ్చిన శిక్షలనుండి తప్పించుకొమ్మని చెబుతారు. దేవుని న్యాయమైన తీర్పు వలన వచ్చిన బబులోను చెరను ఇంకా అనుభవిస్తున్నారని జ్ఞాపకం చేశాడు. అయితే ఇలా ఎంతకాలం సాగుతున్నది? ఆయనకి వచ్చిన దర్శనాలలో అన్యజనుల మీద దేవుని ఉగ్రత కుమ్మరించ బడుతుందని అయితే యెరూషలేము పట్టణాన్ని దేవాలయమును కట్టిస్తాడని చెప్పాడు. దేవుని పూజించే విధానాన్ని ప్రజలకు తెలియజేశాడు.

9వ అధ్యాయము నుండి భవిష్యత్ గురించి ప్రవచించాడు. అందులో మెస్సయ్యను గురించి ప్రవచనాలు, ఈ తరము వారి అంతము గురించి వ్రాయబడినవి. రాజ్యము సిద్ధపరచబడిన తరువాత దేవుని యొక్క దినము ప్రత్యక్షమవుతుందని ఇశ్రాయేలు సమకూర్చబడుతుందని. రాజ్యములకు తీర్పు జరుగుతుందని, దేవుని రాజ్యము నిత్యమవుతుందని చెప్పాడు.

హగ్గయి గ్రంధములో కనిపించే సందర్భమే ఈ గ్రంధము యొక్క సందర్భము ఉద్దేశ్యము. ప్రజలను మందలించి ఆలయ నిర్మాణానికి పురిగొల్పడం అప్పటి స్థితి గతులను గూర్చి మాత్రమే కాకుండా భవిషద్విషయాల గురించి, అంటే రానున్న అభిషక్తుని గురించి యూదులకు కలుగబోయే ఉచ్ఛస్థితిని గురించి దైవవాక్యాలు వీటిలో కొన్ని యేసు ప్రభువు మొదటి రాకతో నెరవేరాయి.

**ఎనిమిది స్వాప్నిక దర్శనాలు :** గొంజిచెట్ల మధ్య గుర్రపు మందలో కనిపించిన వ్యక్తి – నాలుగు కొమ్ముల దర్శనము – కొలనూలు చేతపట్టుకొనిన వ్యక్తి – ప్రధాన యాజకుడు యెహోషువను అలంకరించడం – బంగారు దీపస్థంభము – ఒలీవ చెట్లు దర్శనము – ఎగిరిపోతున్న దర్శనం – కొలతబుట్టలో కూర్చుని ఉన్న స్త్రీ – నాలుగు రథాల దర్శనం, మొదలగునవి.

# సువార్తికుడిగా జాన్ డేవిడ్



అరుణ్‌కుమార్ కె. మహంతి, డైరెక్టర్, ఎ.ఎం.జి. ఇండియా ఇంటర్నేషనల్

**గ్రామీణ సువార్త కూడికలు :**

"వారు బయలుదేరి అంతటను సువార్త ప్రకటించుచు... గ్రామములలో సంచారము చేసిరి" – లూకా 9:6. ఈ వాక్యానుసారం సువార్త ప్రకటన గ్రామాలలో చేయబడాలి. ఈనాడు సువార్తికుడు గ్రామాలలోకంటే పట్టణాల్లో సువార్త చేయడానికి ఇష్టపడుతున్నాడు. గానీ సువార్త అందించబడని కుగ్రామాలలో పరిచర్య చేయడానికి ఇష్టపడుటలేదు. ఈ లోపాన్ని పూరించడానికి గ్రామీణ సువార్త ఆశయంతో మా క్రిష్టియన్ అసెంబ్లీస్ సువార్తికులు పనిచేస్తున్నారు. వీరు ప్రతి సంవత్సరం వారి సంఘములలో మూడు లేక నాలుగు రోజులు సభలు నిర్వహిస్తూ ఉంటారు. చుట్టుప్రక్కల గ్రామాలనుండి అనేకమంది సభలకు హాజరవుతారు. హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న సంఘకాపరులు, ఏరియా ఎల్డర్స్ మరియు ముఖ్యమైన వాక్యోపదేశకులు ప్రసంగిస్తారు. రక్షించబడిన వారికి ప్రత్యేకమైన తరగతులు ఏర్పాటుచేసి వారికి బాప్తీస్మాలు ఇస్తారు. ఈ సమయంలో పగలు వీధిసువార్త ద్వారా మరియు ఇంటింటికి వెళ్ళి కరపత్రములు పంచుటద్వారా దేవునివాక్యాన్ని గ్రామమంతా అందజేస్తారు. ఈ సేవలో వారికి ఏవైనా కొన్ని వ్యతిరేకతలు, చేదు అనుభవాలు ప్రజల నుండి వచ్చినప్పటికీ యేసు వైపు చూస్తూ ముందుకు సాగుతారు.

**నిరీక్షణ సువార్త మహాసభలు - 2004 :**

బ్రదర్ జాన్‌డేవిడ్‌గారి సువార్తపనిలో ఒక మైలురాయి 2004 సం॥ ఫిబ్రవరి నెలలో జరిగిన నిరీక్షణ సువార్త మహాసభలు. ఇవి విశాఖపట్నం, రాజమండ్రి, చిలకలూరిపేట పట్టణాల్లో దేవుని మహిమార్థమై జరిగిన చారిత్రాత్మక సువార్త మహాసభలు. విశాఖపట్నంలో ఏడు వేలమంది, రాజమండ్రిలో ఎనిమిది వేలమంది, చిలకలూరి పేటలో పద్నాలుగు వేలమంది పాల్గొని ఈ సభలను జయప్రదం చేశారు. అమెరికా మరియు ప్రపంచంలోని వివిధ దేశాల నుండి పదహారు వేలమంది సేవకులు దేవుని రాయబారులుగా పాల్గొని సభల ఘనవిజయానికి దోహదం చేశారు. జానేడేవిడ్‌గారి వ్యక్తిగత సాక్ష్యం వేలాది సువారికులను కుదిపివేసింది. ప్రతి స్థలంలోను వేలాదిమంది యేసుక్రీస్తును తమ సొంత రక్షకునిగా అంగీకరించారు. దేవునికి మహిమ, మన ప్రభువైన యేసుక్రీస్తుకు ఘనత చెల్లును గాక. ఒక చెప్పుకోదగిన విశిష్టత ఎనభైరెండేళ్ళ వృద్ధాప్యంలో రెవ.డా॥ స్పిరోస్ జోడియాటిస్‌గారు శారీరక అనారోగ్యాలను అధిగమించి అమెరికా నుండి ఇన్ని వేల మైళ్ళ దూరం ప్రయాణం చేసి ఈ సభలలో పాల్గొనడం.

**చిలకలూరిపేటలో ప్రధాన కార్యాలయం ఎందుకు? :** ప్రారంభంలో జాన్‌డేవిడ్‌గారు సువార్త ప్రకటిస్తూ కొన్నిసార్లు చెప్పులు లేకుండా కాలినడకన కూడా ప్రయాణిస్తూ ఊరూరా తిరిగేవారు. స్టువర్టుపురంలోను, చీరాలలోను ఆయన పనిచేస్తున్న సమయంలో చిలకలూరి పేటలోని సత్యవేదమ్మ డాక్టరుగారి ఆసుపత్రిలో నిర్వహింప బడుతున్న ఆదివారపు సంఘానికి రమ్మని చర్చి పెద్దల నుండి ఆహ్వానం అందింది.

రెండు సంవత్సరాలైనా కాకమునుపే ఆయన చిలకలూరిపేటలో స్థిరపడ్డారు. సత్యవేదమ్మ డాక్టరమ్మను వివాహం చేసుకున్నారు. ప్రభువుసేవ చేయడానికి ఇది అనువైన స్థలంగా దేవుడు ఆయనకు బయలుపరిచాడు. పౌలు వలె ప్రభువు గురించి తెలియని వ్యక్తుల వద్దకు రక్షణ సువార్త తీసుకువెళ్ళాలనేది దేవుడు ఆయనకు ఇచ్చిన పిలుపు. కనుక ఆయన సేవ - గ్రామాలకు మాత్రమే పరిమితం చేసుకున్నారు. మహానగరాలలో ప్రవేశించడానికి ఆయన ఇష్టపడలేదు. కారణం, అంతకుముందే అక్కడ కొన్ని క్రైస్తవ సంఘాలుంటాయి.

50 సంవత్సరాల క్రితం చిలకలూరిపేట – కరెంటు కానీ మరే ఇతర సౌకర్యాలు కానీ లేని ఒక పంచాయితి. ఇది పల్లెటూరు కాదు, పట్టణం కూడా కాదు. దేవుని పిలుపు మేరకు ఆయన చిలకలూరిపేటలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని ఇక్కడేకాక చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్ళి సువార్త పరిచర్య చేస్తూ ఉండేవారు. ఆయన ప్రణాళికలోని పెద్ద పెద్ద పనులకు కావలసిన సహాయకు లంతా ఈ ఊరిలోనే దొరికారు.

ఈలోగా ఊరు పెరిగింది. సౌకర్యాలు వృద్ధి చెందాయి. చిలకలూరిపేట ఇలా జాన్‌డేవిడ్‌గారి వివిధ సేవా కార్యకలాపాలకు కేంద్ర స్థానమైనది.

ఒక వ్యక్తి ఈ ఊరిలో ప్రారంభించి చేసిన సువార్త సేవలను బట్టి చిలకలూరిపేట భారతదేశ సువార్తసేవా పటంలో స్థానం సంపాదించుకుంది.

**ఏరియా రిపోర్ట్స్ :** నెలూరు, విస్సన్నపేట, దర్శి, మార్కాపురం, నూజివీడు, విశాఖపట్నం, రంపచోడవరం, ఆత్మకూరు, కనిగిరి, తెనాలి, మొదలైన ప్రదేశాలు ఏరియా కేంద్రాలుగా ఉంటూ చుట్టుప్రక్కల గ్రామాలలో సేవ విస్తరించబడుతుంది.

**సువార్తికుల సాక్ష్యములు :**

**ఆర్. విజయ్‌కుమార్ :** నా పేరు ఆర్. విజయ్ కుమార్. నేను నెల్లూరు జిల్లాలోని కొత్తూరు, పడారుపల్లిలో సేవచేయుచున్నాను. "దుష్టులు అలాగునుండక గాలి చెదర గొట్టు పొట్టువలెనుందురు" కీర్తన 1:4. దుష్టత్వముతో నిండిన నేను పొట్టువలె మతం అనే గాలిచేత కొట్టుకొని పోయి చివరకు నిజరక్షకుడైన యేసుక్రీస్తును నా రక్షకునిగా అంగీకరించిన వైనాన్ని మీకు తెలియజేయాలను కుంటున్నాను.

1990వ సం॥లో ఇంటర్ మీడియట్ చదువుచున్న రోజులలో ఒక పత్రిక చదివాను. అందులో 2000వ సం॥లో ఈ లోకం అంతం కాబోతోంది. వీరబ్రహ్మంగారు వీరభోగ వసంత రాయుడుగా లోకంను పరిపాలన చేస్తాడు. ఆయన "దుష్టశిక్షణ, శిష్టరక్షణ" చేస్తాడు, అని ఒక ఐ.ఎ.ఎస్. అధికారియైన వేదవ్యాస్‌గారు తపస్సు చేసి ఈ విషయం తెలుసుకున్నాడు అని "గురుమతం" తీసుకున్నాను. నేను భజనలు, ధ్యానాలు, యోగాలు చేయడం ప్రారంభించాను. ఈ మట్టి శరీరానికి స్నానం ఎందుకు? అని వైరాగ్యంగా జీవించాలని శరీరానికి స్నానం లేకుండా, తలదువ్వకుండా ఉండేవాడిని. ఇంత నిష్టగా సత్యం అని వెంబడిస్తున్న మతంలో గురువులు – కాళ్ళు నొక్కించుకునేవారు, భజనకు వచ్చిన స్త్రీల మీద వ్యామోహం కలిగి వ్యభిచారం చేసేవారు, పొగ త్రాగేవారు. ఈ విషయాలు గమనించాను. ఆ మతాన్ని, మనుష్యులను వదిలివేశాను.

నా ఆత్మ రక్షణ నిమిత్తం అన్వేషిస్తున్న సమయంలో డా॥అంబేద్కర్ జీవితచరిత్ర చదివి అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరించినట్లు గ్రహించి, బౌద్ధ మతంలో ఏముందా అని బౌద్ధ గ్రంథం తెప్పించి చదివాను. బుద్ధుడు చెప్పిన నీతిసూక్తులు నన్ను ఆకర్షించాయి. నేను, నా భార్య 1995 సం॥ నుండి నెల్లూరులో హిందూ మతాన్ని వదిలిపెట్టి బౌద్ధ మతం ఆచరించడం మొదలుపెట్టాము. జీవహింస చేయకూడదని నిర్ణయించుకొనిన కొద్ది రోజులకే జీవహింస చేయకుండా మానవుడు జీవించలేడని బౌద్ధమతంను వదిలి పెట్టాను. నా ఆత్మను రక్షించుకోవాలి అనే అన్వేషణలో కార్ల్‌మార్క్స్‌గారి "పెట్టుబడి" చదివిన నేను నాస్తికుడిగా మారి దేవుడు లేడు అనే నిర్ణయానికి వచ్చాను. ఆ పుస్తకం ద్వారా ప్రేరేపించబడి కమ్యూనిస్టు పార్టీలో చేరి డి.వై.ఎఫ్.ఐ.లో వైస్ ప్రెసిడెంటుగా బాధ్యతలు స్వీకరించి, ధర్నాలు, బంద్‌లు నిర్వహిస్తూ రౌడీగా ఉండేవాడిని. ఆ భయంకర జీవితంలో ఉన్న నాకు దైవజనులు బ్రదర్ లివిన్‌గారు యేసుక్రీస్తు యొక్క రక్షణమార్గాన్ని వివరించారు. నన్ను దేవుని మందిరానికి తీసుకొనివెళ్ళారు. ఒక రాత్రి శుక్రవారం ఉపవాస ప్రార్థనకు వెళ్ళిన నేను దేవుని ఆరాధించు సమయంలో దర్శనంలో యేసుక్రీస్తు ప్రభువు సిలువలో వేళాడుతూ రక్తం కారుతున్న దృశ్యం కనబడింది. నా హృదయం కరిగింది. కొత్తనిబంధన చదివి మరణానంతరం జీవితం గురించి, పరలోకం, నరకం గురించి తెలుసుకొని నేను పాపిని అని గ్రహించి, నా పాపముల నిమిత్తం పశ్చాత్తాపం పొంది 1998వ సం॥లో ఏప్రియల్ 18వ తేదీన బాప్తీస్మం తీసుకున్నాను.

ప్రభువు దర్శనంతో నాకు హోసన్న అని పేరు పెట్టారు. 40 రాత్రులు ఉపవాసం ఉండిన పిమ్మట దేవుని వాక్యంలో బలపడుతూ ఉన్న సమయంలో, దర్శనంలో ప్రభువు తన సేవకు నన్ను పిలిచాడు. అప్పటినుండి సేవలో ముందుకు సాగుతూ, కొత్తూరు, టైలర్స్ కాలనీ ప్రాంతంలో సేవ చేస్తున్నాను. పడారుపల్లిలో నూతన మందిర నిర్మాణం చేసినాము. ఈవిధంగా దేవుడు నన్ను రక్షించి తన దివ్య సేవలో ఒక పాత్రగా నన్ను వాడుకుంటున్నందుకు ఆ దేవ దేవునికి మహిమ, ఘనతా కలుగునుగాక! ఆమేన్!

# 13 వ వార్షికోత్సవ వేడుక

పాతనిబంధన గ్రంధమంతా సాక్ష్యాలతో కూడినది. జీవిత కథలు అని చెప్పవచ్చు.

మొదట – దేవుడు ఆది అంతము లేనివాడు. ఆయన మొదట మానవుని సృజించి ఆతనిలో నుండి హవ్వను తయారుచేసి కుటుంబము ఏర్పాటుచేశాడు. వారికి పిల్లలు కలుగుతూ ఉన్నారు. మరణం లేదు. పుట్టిన వారంతా అలానే భూమిని దేవుని ఆజ్ఞ ప్రకారం నింపుతూ ఉన్నారు.

ఆజ్ఞాతిక్రమము జరిగింది. సృష్టములోకి మరణం ప్రవేశించింది. మానవ కుటుంబాలు స్వచ్ఛంగా సంతోషంగా జీవించాలంటే దేవునితో సహవాసం కలిగి ఉండాలి. అలా జరగాలంటే – ఆదాము మొదలు ఈ లోకంలో జన్మించిన వారంతా దేవునితో ఎలా జీవించారు? దేవుడు లేకుండా జీవించి ఏమయ్యారు? అనేది మనం తెలుసుకోవాలి. కనుక పాతనిబంధనలో జీవిత చరిత్రలను మనం అధ్యయనం చేయాలి.

ప్రస్తుతము మనతో పాటుగా జీవిస్తున్న వారికి షూహీయుడైన బిల్దదు ఇచ్చిన సలహా : మునుపటి తరము వారి సంగతులు విచారించుము, వారి పితరులు విచారించిన దానిని బాగుగా తెలుసుకొనుము.

వారు నీకు బోధించుదురు గదా! వారు నీకు తెలుపుదురు గదా! వారు తమ అనుభవమును బట్టి మాటలాడుదురు గదా! అన్నారు.

మన ఆత్మీయ జీవితము ఎదుగుదలకు, ఎక్కువ దూరం పోకుండా ఓ విల్లియంకేరి జీవితం, ఓ భక్తసింగ్ గారి అనుభవాలతో పాటు మనప్రక్కనే ప్రభువుతో నివశించే వారి జీవితములు మనము తెలుసుకోవాలి.

అటువంటి సాక్ష్యాలు సంపాదించడమే "హన్నాకృప" ఆధ్యాత్మిక మాసపత్రిక ఆలోచన. ఇప్పటికి పదమూడు సంవత్సరాలుగా ఈ పనిలో ప్రభువు మాకు ఎంతో అనుభవము ఇచ్చాడు. నేటితరంలో విలువైన సాక్ష్యాలను మనకు అందించిన వారి పితరుల గురించి తెలుసుకోవడం అతి ముఖ్యము. అందువలన నేటితరం సాక్ష్యాలను ప్రచురించే ముందు వారి పితరుల సాక్ష్యాలను కూడా సేకరించడం జరుగుతుంది.

మనం ఈ రోజు ఇలా ఉండడానికి కారణం మన తల్లిదండ్రులు.

చేతికి అందకుండా వెళ్ళిన మన సంతానం దేవునిలో ఎదుగుతున్న మన పిల్లలు అన్నిటికి వారి తల్లిదండ్రులమైన మనమే బాధ్యత వహించవలసి ఉంటుంది.

మా పాఠకులలో ఎక్కువమంది మాకు ఆత్మీయులుగా మారడానికి కారణం వారి పితరుల వద్ద నుండి వారి సాక్ష్యాలను స్వీకరించి పత్రికలో ప్రచురించుట ద్వారా మేము కూడా వారి కుటుంబ సభ్యులలో ఒకరిమై వార ఆదరాభిమానాలకు ప్రేమకు పాత్రులమయ్యాము. కనుక పత్రిక నడిపే బాధ్యతను ఆర్ధిక అవసరతలను దానితో పాటుగా రాత్రింబవళ్ళు పత్రిక కొరకు మా వృత్తి సమయాన్ని వెచ్చిస్తున్నందున మా కుటుంబ భారాన్ని కూడా ప్రభువే భరిస్తున్నాడని పూర్తి విశ్వాసంతో చెబుతున్నాను.

గత పన్నెండు సంవత్సరాలుగా పత్రికతో పరిచయమున్న వారిలో చాలామంది తప్పిపోయారు. చాలామంది మాతో కలుస్తున్నారు. కాని ఒకసారి హన్నాకృప కుటుంబములో కలిసి ఇప్పటికి మాతో కలిసి ఉన్నవారు ప్రభువు వలన ప్రేరేపితులై పత్రికా భారాన్ని మోస్తున్న సంగతి క్రమం తప్పక పత్రిక చదువుతున్న వారందరికి అర్ధమై ఉంటుంది. అటువంటి వారితో మాకున్న అనుబంధము ఈ లోకములో ఉన్న అన్ని బంధాలకంటే మిన్నయైనది.

హన్నాకృపకు విదేశాలలో కూడ అనుబంధము ఉన్నది. వారిని వ్రేళ్ళమీద లెక్కించవచ్చును. అయితే మన దేశములో ఇతర రాష్ట్రాలలో ఉన్నవారిని వ్రేళ్ళమీద లెక్కించ లేము. ఎవరు ఎంత దూరములో ఉన్నా ఆత్మీయత పంచుకోవడానికి ఏది అడ్డం రాలేదు.

ఇప్పటికి పది సంవత్సరాల క్రితం 2002 – మే నెల 11వ తారీకున విజయవాడలోని 'ఐలాపురం' హోటల్లో పత్రిక పాఠకుల సదస్సు జరిగింది. తర్వాత ప్రతి సంవత్సరం పత్రిక పుట్టిల్లు అయిన ఒంగోలులోనే జరిగింది.

ప్రతి సంవత్సరం ఆగష్టు నెలలో కాని, మా అమ్మ "హన్నా" పుట్టిన దినమైన సెప్టెంబరు 14న కాని హన్నాకృప వార్షికోత్సవమును జరిగిస్తున్నాము.

ప్రతి సంవత్సరం – ఈసారి హన్నాకృప వార్షికోత్సవం జరిపించాలా? వద్దా? అంత డబ్బు సమకూడు తుందా? అసలు జరిపించడం దేవుని చిత్తమేనా? అనే తర్కం మనసులో కలుగుతుంది. ఏ సంవత్సరము కాసంవత్సరం ప్రభువు బహు దివ్యంగా జరిగిస్తున్నాడు.

మూడు సంవత్సరాల క్రితం ఆగష్టు 17న హన్నాకృప వార్షికోత్సవం నాడు హైదరాబాద్ నుండి తప్పకుండా విచ్చేసే, వార్షికోత్సవ వేడుకకు అందరికంటె పెద్దమొత్తం ధనసహాయం చేసే పే అండ్ అకౌంట్సు ఆఫీసర్, హన్నాకృప ఆనరబుల్ అడ్వయిజరైన శ్రీ యడవల్లి ప్రసాద్ రావుగారు 'దైవజనుడైన విల్లియం కేరి గారి జన్మదినము – బాప్టిస్టు డే అని పిలువబడుచున్న రోజునే హన్నాకృప జన్మదినముగా జరిపించడం సంతోషకరము' అన్నారు. అప్పటినుండి బాప్టిస్టు డే గా పిలువబడుచున్న ఆగష్టు 17వ తారీఖున హన్నాకృప పాఠకుల సదస్సును ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

మూడు నెలల క్రితం నా ఆఫీసులో – రాబోయే వార్షికోత్సవమును పాఠకుల సదస్సుగా ప్రతి సంవత్సరం ఒక పట్టణంలో జరిగించాలని నిర్ణయమైనది. కనుక నా పెద్దకుమారుడు రెవ.డానియేల్, చిన్నకుమారుడైన నతనయేలు హైదరాబాద్ నగరమునకు ప్రయాణమయ్యారు.

గత నాలుగు సంవత్సరములలో హైదరాబాద్‌లో అత్యున్నతమైన గవర్నమెంటు ఆఫీసర్లు హన్నాకృప పాఠకులుగా నమోదు చేయబడడమే కాక అనేకమంది యవ్వనస్థులైన సాఫ్‌వేర్ ఇంజనీర్లు కొడవటికంటి రచనలు చదివి హన్నాకృప పాఠకులైనారు. హైదరాబాద్‌లో కొందరు ప్రముఖులను కలుసుకొని ప్రోత్సాహపూరితమైన మనస్సుతో ఒంగోలు వచ్చారు.

గత సంవత్సరము ఆగష్టు 16న హైదరాబాద్ నుండి బయలుదేరి కొడవటికంటిగారిని అభినందించుటకు ఒంగోలు వచ్చిన సువర్ణరాజు సుశీలమ్మగార్ల ఆర్థిక సహాయముతో సువార్తలలోని యేసుకథ మూడవ భాగము విడుదలకు సిద్ధమైనది. హైదారాబాద్ బంజారాహిల్స్‌లోని బాప్టిస్టు చర్చిలో నా మూడవ కుమారుడైన "ఏలియా చక్రవర్తి" చురుకైన పాత్ర కలిగి ఉన్నందున నా నాల్గవ అల్లుడు శ్రీ యంద్రపాటి శ్రీనివాసరావుగారు చర్చికి సమీపమున సొంత ఇల్లు కలిగియున్నందున బంజారా హిల్సు బాప్టిస్టుచర్చి పాస్టరుగారైన రెవ.టి.పి.మాథ్యూస్‌బాబు గారు సంతోషముగా అంగీకరించినందున 16 ఆగష్టు ఉదయం నా తమ్ముడు రెవ.డా.జోసఫ్‌గారి 'సుమో'లో ఒంగోలునుండి బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంటకు సాగర్ – ఔటర్ రింగ్‌రోడ్డు, అపోల్లో మీదుగా బంజారాహిల్స్ చేరాము.

17న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సేవాభారత్ జనరల్ డైరెక్టర్ రెవ.డా.చిరంజీవిగారి ఆహ్వానము మేరకు జోడిమెట్లలోని వారి ఆఫీసులో వారిని కలిసి సాయంకాలం 3 గంటలకు బంజారాహిల్సుకు వచ్చాము.

సాయంకాలం అయిదుగంటల నుండి ఆహ్వానితులు అన్ని పట్టణాలనుండి హైదరాబాద్ సికింద్రాబాద్ అంచుల నుండి కూడా రాసాగారు.

సాయంకాలం అయిదున్నరకి మొదటిగా శ్రీ బి. జీవరత్నం గారు రిటైర్డు డివిజనల్ ఇంజనీర్ గారిని వారి కుమార్తె రూప టూవీలర్ మీద తీసుకొని వచ్చింది. జీవరత్నం గారు ప్రతినెల హన్నాకృప ప్రశ్నలకు తప్పకుండా జవాబులు వ్రాస్తుంటారు. వారిని ఇప్పుడు మొదటిసారి చూశాను. వారు మల్కాజ్‌గిరి నుండి వచ్చారు. వారితో మాట్లాడుతుంటే బ్రదర్ జుటికె పాల్ విక్టర్‌గారిని ఆయన కుమారుడు మైకెల్ టూవీలర్ మీద తీసుకొనివచ్చారు. పాల్ అన్న 1953లో

**తరువాయి భాగం 28 వ పేజీలో**

# యోగ్యురాలు

3

**(దైవజనురాలు - చెల్లి సంతోషమ్మ గారి సాక్ష్యము)**

**రచన : శ్రీమతి డి. పరిశుద్ధం, బి.యస్.సి, బి.ఇడి.**

**3. ప్రార్థనా జీవితం** : 'విశ్వాసికి ప్రార్థన ఊపిరి' అనేది సంతోషమ్మ సిద్ధాంతం ఉదయం వ్యక్తిగత ప్రార్థన చేసేది. భర్తను మోకరింపజేసి ప్రార్థించేది. పిల్లలందరితో ప్రార్థించేది. పాఠశాలలో కూడ పిల్లలచేత ప్రార్థన చేయించేది. తన సౌఖ్యము కంటే, నా దేవుడు సంతోషపడాలి అని తలంచేది. ఉపవాస ప్రార్థనలు తరచు నిర్వహించి – రాత్రంతా మోకాళ్ళ మీద ప్రార్థించి దైవసన్నిధిలో నుండి దీవెనలు జవాబులు తెచ్చేది. దేవుడిలాగు చెప్పాడు అని ముందే చెప్పేది. అవి నిజంగా జరిగినపుడు ఆమె ప్రార్థన దేవుడు విన్నాడని అప్పుడు తెలిసేది. కనిపెట్టు ప్రార్థన ఎక్కువ చేసేది. ప్రార్థించి ఏమి జరుగబోతుందో ముందే చెప్పేసేది. ఒకసారి యవ్వనురాలు కొరకై ఇట్లు ప్రార్థించెను – దేవా! ఈ అమ్మాయిని రక్షించండి, లేదా మీ జీవగ్రంథంలో నుండి నా పేరు తుడిచివేయండి అని గట్టిగా ప్రార్థించెను. దేవుడు అద్భుతముగా ఆ యవ్వనురాలిని మార్చెను. ఆమె ఇప్పుడు దేవుని సేవచేసి అనేక ఆత్మలను ప్రభువు దగ్గరరకు నడిపించుచున్నది. గోవతోటి బాలకోటయ్య అనే ఒక పేరు వహించిన డ్రామా నటుడు ఉండేవారు. అతని మారుమనస్సు కొరకై ఎంతో ప్రార్థించగా అతడు ఆశ్చర్య రీతిగా మారుమనస్సు పొంది ప్రభువు దగ్గరకు చేరెను. ప్రార్థనకు అసాధ్యమైనదేదియు లేదు అనేది సంతోషమ్మగారి అనుభవమైయుండెను.

ప్రార్థనాత్మతో నింపబడి యుండగా కొన్నిసార్లు దేవుడు "భాషలు" మాట్లాడే కృపే నిచ్చేవాడు. భాషలతో మాట్లాడగా మరొకరు దాని భావం చెప్పేవాడు. వాటిలో అనేకములైన రాబోవు సంగతులు మాత్రం ఉండేవి. పరిశుద్ధాత్మ వచ్చినపుడు రూతమ్మగారు భాషలో మాట్లాడగా సంతోషమ్మ గారు దానికర్థములు చెప్పుచుండేది. ఇట్టి ఆత్మవరములు ప్రార్థన జీవితంలో కలిగియుండెను.

ఒకరాత్రి వాక్య పరిచర్య తర్వాత – సంతోషమ్మ ప్రార్థించుచుండగా దేవుని ఆత్మ ప్రజల మీదికి దిగివచ్చెను. ప్రజలందరు పశ్చాత్తాపముతో నింపబడియుండిరి. పెద్దగా ఎలుగెత్తి అందరు పశ్చాత్తాపపడుచుండగా ఆ రోదనకు గ్రామంలో ఉండే అనేకులు ఇక్కడ ఏదో అఘాయిత్యం జరిగిందనుకొని వచ్చి ఈ ప్రజల ఆత్మీయ ప్రార్థనను చూచి ఆశ్చర్యపడిరి. వచ్చిన వారిలో కొందరిని దేవుని ఆత్మ పట్టుకున్నందున కొందరు మారుమనస్సు పొందిరి. సంతోషమ్మ ప్రార్థనాశక్తి అనేకులను పట్టుకొనెను. ఎన్నో ఆత్మలకు మేలుకరమైన రీతిని ప్రార్థన జ్యోతులు వెలిగించెను. ప్రార్థన తీవ్రత వలన, లెక్కలేనన్ని ఉపవాసముల వల్ల సంతోషమ్మ శరీరంలో నున్న నిరోధక శక్తి తగ్గినదని వైద్యులు చెప్పిరి. ఎంతటి ప్రార్థన తీవ్రత!

**ఏకాంత ప్రార్థన ప్రాముఖ్యము** : సంతోషమ్మగారి ఇంటిలో అందరు తప్పక ప్రార్థించవలసిన అలవాటు ఒకటున్నది. ప్రతి సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ఏకాంత ప్రార్థన చేయవలసియున్నది. ఆ సమయంలో దేవుడు ఏమి చెప్పునో గ్రహించి అందరు సంతోషమ్మకు చెప్పవలసియుండెను. ఏకాంత ప్రార్థన క్రమము ఆ కుటుంబపు విజయములకు ఎంతో తోడ్పడుచున్నది. బైబిలు లోని దానియేలు భక్తుడు దినమునకు మూడుసార్లు క్రమము తప్పక ప్రార్థించినందువలన సింహముల నోర్లు మూసివేయ బడెను కదా! అటులనే ప్రార్థించువారు సమస్యలను జయింతురు అనే ధృడమైన నమ్మకము ఆ కుటుంబములో వ్యాపించియున్నది. ఒకరోజు మోషేగారు ఏకాంత ప్రార్థన సమయంలో కాలకృత్యములకై వెళ్ళుచు తర్వాత చేసుకోవచ్చులే ఏకాంత ప్రార్థన అని తలంచి వెళ్ళెను. నిర్లక్ష్య భావము వలన ప్రార్థించి సమయమును వ్యర్థపరచి నందున మోషేగారిని కట్లపాము కరిచెను. ప్రార్థనకు వచ్చిన వారందరు ఆందోళన చెందుచుండిరి. సంతోషమ్మగారు ప్రార్థన చేసుకొని ముగించి ఏమిటయ్యా? అని అడిగెను. పాము కాటు విషయం సంతోషమ్మగారు విని – దేవునికి స్తోత్రం! ఎంత మంచి దేవుడవయ్యా అనెను. అందుకు మోషేగారు నేను చస్తే ఈమెకు సంతోషమా? అని తలంచెను. అప్పుడు సంతోషమ్మగారు – ఏకాంత ప్రార్థన నియమము పాడుచేసినందులకు ప్రేమ గల దేవుడు ఈ శిక్ష విధించారు అని సంఘమంతటితో కలసి ఉపవాస ప్రార్థనలు చేసెను. దేవుడే పాము కాటు విషం నుండి బ్రతికించెను.

ఆవిధంగా ఏకాంత ప్రార్థన ప్రాముఖ్యతను సంఘమంతటిలో ప్రబోధించెను. సంఘస్తులు కూడా ఏకాంత ప్రార్ధనా శక్తిని గ్రహించిరి. సంతోషమ్మగారి ప్రార్ధనా బలము క్రమముగా గ్రామమునందే గాక, పలు ప్రక్క గ్రామములకును వ్యాపించుట ప్రారంభమయ్యెను. ఉపవాస ప్రార్థన జరుగుచున్నపుడు చిన్న బెత్తం తీసుకొని, కాపలా వ్యక్తివలె అందర్నీ హెచ్చరించుచూ రాత్రంతా ప్రార్థించుచు ఉండేది. ప్రార్థన అంటే ఆమె ప్రాణంలాగా ఉండేది.

అనారోగ్యత నండి స్వస్థత – పరిశుద్ధతను కోరుట : పెద్ద పిల్లలిద్దరు పుట్టిన తదుపరి – సంతోషమ్మగారు గర్భవతియైరి. రక్తపు లేమి వలన బలహీనురాలయ్యెను. చాలా నీరసమయ్యెను. కాన్పు కొరకై చీరాల 'బేరు' ఆస్పత్రికి వెళ్ళిరి. డాక్టర్లు పరీక్షించి 30 శాతము రక్తమే యున్నట్లు చెప్పి, దాని వలన కలుగు అపాయమును తెలిపిరి. మోషేగారు ప్రయాసపడి రక్తపుష్టికై బహు ప్రయత్నము చేసిరి. సంఘము ఆత్మీయ తల్లి ఆరోగ్యం కొరకు ఎంతో ప్రార్థించిరి. దేవుడు సంతోషమ్మను ముట్టెను. ఆ కాన్పులో పరిశుద్ధం అనే పాప జన్మించెను. సంతోషమ్మగారు ప్రార్థించుచుండగా దర్శనములో "పరిశుద్ధంను నాకిమ్ము" అని ప్రభువు కోరగా ఇచ్చెదనని సంతోషమ్మగారు అంగీకరించిరి. ఈ విషయమును భర్తగారితో చెప్పగా, మోషేగారు ప్రభువు అడిగితే అభ్యంతరమా? అబ్రహామును దేవుడు అడిగితే, కుమారుని సమర్పించెను గదా! మనం సిద్ధంగా ఉందా మని చెప్పిరి. మూడు సంవత్సరముల వయస్సు వచ్చింది పరిశుద్ధంకు. పరిశుద్ధం చాలా జబ్బు పడెను. ఎందరు వైద్యులు ఎన్ని మందులు వాడినను జబ్బు తగ్గలేదు. ప్రయోజనం లేకపోయింది. ఇక ప్రభువుకు తామిచ్చిన వాగ్దానం గుర్తుకు వచ్చిందట. వెంటనే భార్యా భర్తలు కలిసి ప్రార్థించి ప్రభువా! మీరు కోరినది అంగీకరించుచున్నాము అని స్తుతించి ప్రార్థించగా – ఆ పరిశుద్ధం నెమ్మదిగా పరలోకము చేరెను. ఈ పరిస్థితిని గమనించిన అనేకులగు క్రైస్తవులు, హిందువులు ప్రభువుతో సంతోషమ్మకు సంబంధం కదలని ఆత్మీయ భక్తికి సంతోషించిరట. తదుపరి ఆ దంపతులు ప్రార్థించగానే మరియొక గర్భము దేవుడిచ్చెను. ఆమెయే ఇప్పుడు బ్రతికియున్న పరిశుద్ధం. ప్రభువు ఏలాటి అద్భుతములు చేయునో గమనించగోరుచున్నాను.

# కొడవటికంటి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | – 25రూ. |
| 2. | జవ్వత్పనేహు | – 30రూ. |
| 3. | ఆసెనతు | – 60రూ. |
| 4. | అపోస్తలుడు | – 60రూ. |
| 5. | బర్నబా | – 30రూ. |
| 6. | తివోతి | – 40రూ. |
| 7. | నా చిత్తానుసారుడు | – 80రూ. |
| 8. | గుంట నుండి మింటికి | – 50రూ. |
| 9. | విశ్వాసంలో ఓ మెట్టు | – 60రూ. |
| 10. | విశ్వాసంలో మరో మెట్టు | – 65రూ. |
| 11. | తోటలో పనివాడు | – 20రూ. |
| 12. | గోత్రకర్త | – 50రూ. |
| 13. | నా కుటుంబము | – 25రూ. |
| 14. | నా దూత | – 50రూ. |
| 15. | నా కుమారి | – 60రూ. |
| 16. | నా స్నేహితుడు | – 50రూ. |
| 17. | అంత్యదినములలోని యదార్ధ ప్రవక్త | – 50రూ. |
| 18. | హన్నాకృప సజీవసాక్ష్యాలు –1 | – 65రూ. |
| 19. | హన్నాకృప సజీవసాక్ష్యాలు –2 | – 65రూ. |
| 20. | ప్రయాణంలో ఓ మజిలి | – 65రూ. |
| 21. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | – 70రూ. |
| 22. | సువార్తలలోని యేసుకథ | – 75రూ. |
| 23. | యేసుకథ రెండవ భాగం | – 75రూ. |
| 24. | యేసుకథ మూడవ భాగం | –75 రూ. |

+ + +

| | | |
|---|---|---|
| 25. | జీవనమంతయు | |
| 26. | విశ్వాసము – విజయము | |

**కొడవటికంటి రచనలు మొత్తం ఇప్పటికి ఇరవై ఆరు.**

# వేదముల సాక్ష్యము



వి.జె. పట్నాయక్, జాయింట్ డైరెక్టర్, అగ్రికల్చర్ (రిటైర్డ్)

**యేసు ప్రపంచ చరిత్రలో ఉన్నాడు :** యేసుక్రీస్తు నిజముగా ముప్పది మూడున్నర సంవత్సరాలు ఈ ప్రపంచములో జీవించెను. ప్రతి దేశమునకు వారి సొంత క్యాలెండరున్నను క్రైస్తవ క్యాలెండరు ననుసరించి క్రీ.పూ. మరియు క్రీ.శ. అని ఉదహరించకపోయినచో తేది గ్రహించలేకున్నారు ప్రపంచములోని జనులు. ఈయన జననం, కాలాన్ని రెండు చెక్కలు చేసింది. ప్రపంచంలోని ప్రతివ్యక్తి (నాస్తికులు సహా) తేదీని వేసినప్పుడెల్లా క్రీస్తు వాస్తవ చారిత్రాత్మక పురుషుడని అప్రయత్నంగా ఒప్పుకుంటున్నారు. క్రీస్తు శకమును ఎవరును మార్చలేరు. అద్భుతమైన "అదృశ్యమైన శక్తిమంతుడు"అందరిని స్వాధీనములో ఉంచు కొనుచున్నాడు. ఎంత ఆశ్చర్యము! ఎవరును సత్యమును తిరస్కరించలేరు కదా!

**యేసు తన దైవత్వమును నిరూపించెను :**

**1.** కానా పెండ్లి విందున నీటిని ద్రాక్షా రసముగా చేసి తన సృష్టి శక్తి కనబరచెను. (యోహాను 2:1-11)

**2.** స్త్రీలును, పిల్లలును గాక 5000 మంది పురుషులకు 5 రొట్టెలు, రెండు చేపలును,- స్త్రీలును పిల్లలును గాక 4000 మంది పురుషులకు 7 రొట్టెలు కొన్ని చిన్న చేపలను దీవించి తృప్తిగా భోజనము పెట్టుటలో కూడ తెలియుచున్నది. (యోహాను 6:1-14; మార్కు 8:1-9)

**3.** అధికారముతో పాపములను క్షమించెను. (లూకా 5:20-26)

**4.** ఆయన మృతులను బ్రతికించెను. (యోహాను 11వ అధ్యాయము; లూకా 7:11-17; 8:41-56; మత్తయి 9: 18-26)

**5.** పుట్టు గ్రుడ్డివారికి దృష్టిని ఇచ్చెను, కుంటివారి కాళ్ళు బాగుచేసెను, కుష్ఠురోగులను స్వస్థపరిచెను, చెవిటి వారికి వినికిడి శక్తినిచ్చెను, రోగులందరిని స్వస్థపరిచెను. (మత్తయి 9:27-31; 20:29-34; మార్కు 7:31-37 మొ॥నవి.)

**6.** నీటిమీద నడచి, తుఫానును గద్దించి నిమ్మళపరచి సృష్టికర్తగా ప్రకృతిపై తన అధికారమును నిరూపించెను. మత్తయి 8:23-27; మార్కు 6:45-52)

**7.** "మాకొక నియమము కలదు. తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెనని" యూదులు చెప్పిరి. (యోహాను 19:7)

**యేసుక్రీస్తు అను నామము ఎందుకు? :** క్రైస్తవులు దేవునికి పేరు లేదంటు ప్రార్థన చేయుచున్నప్పుడు "యేసుక్రీస్తు నామమున" అని ఎందుకు చెప్పుచున్నారు? అని ప్రశ్నించవచ్చును.

అవును. దేవునికి పేరు లేదు. ముందుగా మనము చూచినట్లుగా "యేసు" అనగా రక్షకుడు, "క్రీస్తు" అనగా అభిషక్తుడు అని అర్థము. ఆయన అభిషేకింపబడిన రక్షకుడు. అయితే ఇతరుల నుండి ప్రత్యేకించి గుర్తుపట్టుటకు నామము అవసరము.

**అంతా ఒక్కటేనా? :** నదులన్నియు సముద్రములో కలియునట్లు అందరు మోక్షము చేరుదురు. ఏ నామమైతేనేమి? ఏ మతమైతేనేమి? " ఏ మతమైనను గమ్యమొక్కటే. యేసు క్రీస్తు నామము తప్పనిసరి కాదు అని కొందరనవచ్చును.

అట్లుకాదు, పురుషులందరు ఒక్కటే, గాని ఒక స్త్రీ తన భర్తను గుర్తించి అతని పేరును బట్టి తన సొంత భర్తయని నిరూపించవలెను. అట్లుగాక "పురుషులంతా ఒక్కటే; పేరుతో ఏమున్న" దనిన మనము ఆమెను వేశ్య అందురు గదా!

అదేవిధముగా బైబిలునందు దేవుడు తనను గాక వేరొకరిని పూజించు వారిని వ్యభిచారులుగా నుదహరించెను. కొన్ని వాక్యములను చూడనగును.

**యూదులధర్మశాస్త్రములో హెబ్రీ భాషలో ఇట్లున్నది :**

**1.** "వారు... విగ్రహములతో వ్యభిచరించిరి" అని వ్రాయబడియున్నది. (యెహెజ్కేలు 23:37 క్రీ.పూ.593)

**2.** "నేను నీకిచ్చిన బంగారువియు, వెండివియునైన ఆభరణములను తీసుకొని నీవు పురుషరూప విగ్రహములను చేసుకొని వాటితో వ్యభిచరించితివి" అని దేవుడు చెప్పుచున్నాడు. (యెహెజ్కేలు 16:17 క్రీ.పూ.594)

**3.** "రాళ్ళతోను, మొద్దులతోను వ్యభిచారము చేసెను" (యిర్మియా 3:9 క్రీ.పూ.612)

**4.** "ఆ దేశపు నివాసులతో నిబంధన చేసుకొనకుండా జాగ్రత్తపడుము. వారు ఇతరుల దేవతలతో వ్యభిచరించి ఆ దేవతలకు బలి అర్పించుచున్నప్పుడు ఒకడు నిన్ను పిలిచినయెడల నీవు వాని బలి ద్రవ్యమును తినకుండ చూచుకొనుము. మరియు నీవు నీ కుమారుల కొరకు వారి కుమార్తెలను పుచ్చుకొనునెడల వారి కుమార్తెలు తమ దేవతలతో వ్యభిచరించి నీ కుమారులను తమ దేవతలతో వ్యభిచరింపచేయుదురేమో. పోత పోసిన దేవతలను చేసుకొనకూడదు". (నిర్గమ. 34:14-17 క్రీ.పూ. 1491)

క్రొత్త నిబంధనలో గ్రీకు భాషలో ఈలాగు వ్రాయబడియున్నది - "దేవతలనబడిన వారును, ప్రభువులనబడిన వారును అనేకులున్నారు. ఆకాశమందైనను, ఆయన తండ్రి; ఆయన నుండి సమస్తము కలిగెను. ఆయన నిమిత్తము మనమున్నాము మరియు మనకు ప్రభువు ఒక్కడే; ఆయన యేసుక్రీస్తు. ఆయన ద్వారా సమస్తము కలిగెను; మనము ఆయన ద్వారా కలిగినవారము"

(1కొరింథి 8:5,6 క్రీ.శ. 59)

"ఆ కుమారుని యందు మనకు విమోచనము అనగా పాపక్షమాపణ కలుగుచున్నది. ఆయన అదృశ్య దేవుని నిజస్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడైయున్నాడు, ఏలయనగా,ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవి గాని, అవి సింహాసనము లైనను, ప్రభుత్వములైనను, అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికి ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు". (కొలస్సి 1:14-17 క్రీ.శ.64)

స్నేహితులారా! నిజమైన దేవునిని మనము గుర్తించిన తరువాత ఆయనను తృణీకరించిన యెడల ఘోర నరకము తప్పదని మన వేదములు తెల్పుచున్నవి.

**"అంధంతమః ప్రవిశంతియే -సంభూతిముపాసతే తతో భూయ ఇవతేత మోయ ఉసంభూత్యాగ్ం రతాః " (యజుర్వేదము 40:8)**

**భావము**: పరమాత్మని విడిచి కంటికి కనబడు సృష్టిపదార్థములను పూజించువారు ఘోర నరకమున బడుదురు.

**గొప్ప స్వాతంత్ర్యము :** మనకు ఇష్టమైన దానిని కోరుకొని అనుసరించుటకు పూర్తి స్వాతంత్ర్యము దేవుడు అనుగ్రహించియున్నాడు. మానవుడు దేవునికి విరోధముగ కోరుకొని తిరుగుబాటు చేసినను ఈ "ఈవి" ఆయన తీసివేయలేదు. దేవునికి లోబడినయెడల శాంతి సంతోషము కలిగియుందుము. తిరుగుబాటు చేసినచో మనశ్శాంతి సంతోషము దూరమగును. నిజ దేవునిని కనుగొని ఆయనకు లోబడినప్పుడే ఆత్మకు శాంతి చేకూరును. ఆత్మ శాంతి లేక అనేకులు అల్లాడుచున్నారు. ఏమి చేసినను, ఎన్నియున్నను సంతుష్టి కలుగుటలేదు. ఏదో ఒక్కటి తక్కువైనట్టు మనస్సులో కలతయుండును. ఆ కొరత ఏమనగా దేవునితో సమాధానము, అందువలన కలిగెడు పరిశుద్ధాత్మ యందలి ఆనందము లేకుండుట. ఇవి దేవుడు ఉచితముగా క్రీస్తునందు ఇచ్చు బహుమానములు.

సంస్కృతము, హెబ్రీ, గ్రీకు భాషలలో వ్రాయబడిన వివిధ వేదములను మనము చూచియున్నాము. దేవుడు పరిశుద్ధుడు, మనము కూడ పరిశుద్ధులమై యుండవలెనని దేవుడు కోరుచున్నాడు. ఈ పరిశుద్ధత దేవుని కుమారుడును, మనుష్యకుమారుడునైన యేసుక్రీస్తు రక్తముచే కడుగబడుటవలన మనకు కలుగుచున్నది. యేసుక్రీస్తే వేదానుసారమైన, పాప ప్రాయశ్చిత్త బలియాగముగా తన్ను తాను అప్పగించుకొనిన విరాట్పురుషావతారమని విస్పష్టమగుచున్నది. సత్యమైనది కోరుకొనుట మన బాధ్యతయైయున్నది.

## క్విజ్ సెప్టెంబర్ నెల ప్రశ్నలు 88

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

**దానియేలు 7 నుండి 12వ అధ్యాయము వరకు**

**1. దానియేలు భోజనమునకు – శాకధాన్యాదులు, పానముకు నీళ్ళు అడిగినట్లు 1:12లో చూశాము. జీవితాంతము ఆలాగునే ఉన్నారని మీరు భావించుచున్నారా?**

**2. నక్షత్రముల ప్రకాశములో భేదమున్నదని పౌలు 1కొరింథి 15:41లో అనుటకు కారణము దానియేలుకు వివరింపబడిన దని అనుకొనుటకు ఆధారమైన వాక్యమును వివరించండి?**

## ఆగష్టు నెల ప్రశ్నలకు జవాబులు:

**1. దానియేలుకు ఇయ్యబడిన పేరు ఎవరు పెట్టారు? అది ఎవరి పేరు? దాని ప్రత్యేకత ఏమి?**

**జవాబు:** ఆష్పెనజు అను నపుంసకుల అధిపతి పెట్టినాడు. (దానియేలు 1:3-7), ఈ పేరు కల్దీయుల దేవత పేరు (దానియేలు 4:8), తెలివి జ్ఞానము కలవానికి పెట్టబడిన పేరు (దానియేలు 5:12)

**2. మానవుల రాజ్యము పైన అధికారి ఎవరు?**

**జవాబు:** సర్వోన్నతుడైన దేవుడు (దానియేలు 4:26)

**జవాబులు ప్రయత్నించినవారు :**

**శ్రీమతి కొండేటి సులోచనాదేవి (ఒంగోలు)**
**శ్రీమతి టి. క్రిస్టియానమ్మ (నందికొట్కూరు)**
**శ్రీమతి ఎ. సరోజిని (గద్దలగుంట)**
**బ్రదర్ బి. జీవరత్నం (హైదరాబాదు)**
**శ్రీమతి గుత్తికొండ అన్నమ్మ దానియేల్ (నరసరావుపేట)**
**శ్రీమతి బత్తుల ఆనీమేరి (హైదరాబాదు)**

## ఈ నెల పోషకులు :

**జూలై 21 నుండి ఆగష్టు 21, 2012 వరకు మాకు చేరినవి.**

| | | |
|---|---|---|
| శ్రీ నిమ్మగడ్డ సుధీర్ | హైదరాబాదు | 3500 |
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | హైదరాబాదు | 2000 |
| శ్రీమతి కె. విక్టోరియా రుక్మిణి, | మార్కాపురం | 2000 |
| అపోస్తలుడైన ఎబినెజరు | హైదరాబాదు | 1100 |
| బ్రదర్ షాలేమ్ విక్రాంత్ వర్ధన్ | గుంటూరు | 1000 |
| శ్రీ చేబ్రోలు సాల్మన్‌రాజు | నరసారావుపేట | 1000 |
| డా॥ జడ్.సి. దేవదానం | కర్నూలు | 1000 |
| శ్రీమతి పులుకూరిసూర్యకాంతం | నెల్లూరు | 1000 |
| బ్రదర్ సి.ఎల్.హెచ్. బెన్నిసన్ | బెంగుళూరు | 700 |
| బ్రదర్ మద్దిరాల బోయజు | ఒంగోలు | 500 |
| కుమారి కె. ప్రసన్నభారతి | ఒంగోలు | 500 |
| శ్రీమతి కూచిపూడి సౌభాగ్యం | ఒంగోలు | 200 |
| శ్రీ తెంటు చంద్రశేఖర్ | విజయవాడ | 200 |
| శ్రీ జంగాల ఆనందం | ఒంగోలు | 200 |
| శ్రీమతి శ్రీదేవి | భీమిలి | 200 |

✦ ✦ ✦

| | | |
|---|---|---|
| డా.శ్రీమతి సునీత | హైదరాబాద్ | 1000 |
| రెవ.డా.దాస్‌బాబు | హైదరాబాద్ | 600 |
| పాస్టర్ కె.సంపత్ రావ్ | హైదరాబాద్ | 500 |
| శ్రీ పాల్ విక్టర్ | హైదరాబాద్ | 500 |
| రెవ. విజయచంద్ర | బెంగుళూరు | 500 |
| శ్రీమతి అరుణ | చెన్నై | 500 |
| శ్రీమతి దీవెన పాల్ | హైదారాబాద్ | 500 |
| శ్రీమతి శోభ అబ్రాహాము | కందుకూరు | 500 |
| శ్రీ జనార్ధనరావు | బెంగుళూరు | 300 |
| శ్రీ పసుపులేటి ఆంజనేయులు, యస్.ఐ. | ఒంగోలు | 300 |
| శ్రీమతి కనికరమ్మ | కోలవెన్ను | 200 |

**ఒంగోలు వాస్తవ్యుడై హైదారాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న 26 సంవత్సరముల వయస్సు కలిగి ఏకైక కుమారుడైన విశ్వబ్రాహ్మణుడైన, 5 అడుగులు 8 అంగుళాల ఎత్తు కలిగి ఆరోగ్యవంతుడైన యువకునికి క్రైస్తవ మతాభిమానము కలిగి దేనిలోనైనను పి.జి. చదివిన విశ్వబ్రాహ్మణ యువతి వివాహమునకు కావలెను. వివరములకు 9866 716 506 సంప్రదించ మనవి.**

# *13 వ వార్షికోత్సవ వేడుక*



చీఫ్ ఎడిటర్ - కొడవటికంటి గారు



ఎడిటర్ - నతానియేల్ ఆర్ .కొడవటికంటి గారు



గౌరవ సలహాదారులు శ్రీ యడవల్లి ప్రసాదరావుగారు




పోషకులు శ్రీ జడ్.సి. దేవదానంగారు



చర్చ్ పాస్టర్ రెవ. డా ॥ టి.పి.మాథ్యూన్‌బాబుగారు



పాఠకులు శ్రీ ఈనక్ డేవిడ్‌గారు




**" సువార్తలలోని యేసుకథ "**
**3వ భాగం**
**ఆవిష్కరిస్తున్న**
**శ్రీ ఎడ్వర్డ్‌గారు**
**శ్రీ దానుబాబుగారు,**




**రచయిత మరియు చీఫ్ ఎడిటర్ శ్రీ కొడవటికంటిగారిని సన్మానిస్తున్న శ్రీ దానుబాబుగారు, శ్రీ ఎడ్వర్డ్‌గారు, శ్రీ కట్టా నాగేశ్వరి భాస్కర్‌గారు.**




**హన్నాకృప 13వ వార్షికోత్సవానికి హాజరైన పాఠకులు.**

# విశ్వాసము - విజయము

ఇంకా తెల్లవారలేదు. కనీసం తెల్లని వెలుతురయినా పూర్తిగా కలుగలేదు. నాయన ఏదో ఊరు వెళ్తున్నాడేమో!? సిద్ధపడుతున్నాడు. మద్రాసు బెస్ట్ అండ్ కంపెనీలో ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిబ్యూటర్‌గా ఓ చిన్న వ్యాన్, దానికి డ్రైవరు కూడా ఉన్నాడు.

చాప మీద నుండి లేచి కూర్చున్నాను. నా తరువాత ఎనిమిదిమంది పిల్లలు ఉన్నారు. అంతా చిన్నవారే! ఆఖరి అమ్మాయికి రెండు సంవత్సరాలు. అంతా నేలపై చాపమీద చెల్లాచెదరుగా నిద్రపోతున్నారు. చాప మీద నుండి లేచి బయటికి వచ్చాను. కొంచెంసేపటికి నాన్న బయటికి వచ్చి హడావిడిగా మద్రాసు రైలు ఎక్కడానికి స్టేషన్‌వైపుగా వెళ్తున్నాడు. నాన్నను చూస్తే నిజంగా జాలివేసింది. పూర్వం విజయవాడ దగ్గర నూజివీడు సమీపంలో మర్సపూడి, ఈదర, రాచర్ల గ్రామాలలో పాస్టరుగా పనిచేశాడు. మంచి సేవ చేస్తుండేవాడు. నాయన ఏ ఊర్లో పనిచేస్తుంటే ఆ ఊర్లో అమ్మకి టీచరు పనియిచ్చారు దొరలు. అదికాక దొరలు అప్పుడప్పుడు బహుమతులు కూడా ఇస్తుండేవారు. పెద్ద కుటుంబము అని ప్రేమించేవాళ్ళు. పాతదొర అమెరికా వెళ్ళిపోయిన తర్వాత క్రొత్తదొర వచ్చాడు. ఆయనకు పెద్ద సంతానము ఉన్న కుటుంబాలు అంటే అలర్జీ. ఒకరోజు మర్సపూడిలో ఉన్నప్పుడు విజయవాడ గుణదల నుండి నూజివీడు మిషన్ ఆస్పత్రికి వెళ్తూ మా ఇంటికి వచ్చాడు. భారతీయుల భోజనము ఆయనకు అలవాటే! భోజనము చేసిన తర్వాత మాటల్లో "ఇంత పెద్ద కుటుంబము ఎలా పోషిస్తున్నావు?" అన్నాడు.

"మనం మన కుటుంబాలను పోషిస్తున్నామా? ప్రభువే మనలను పోషిస్తున్నాడు" అన్నాడు నాన్న.

''నిజమే కాని మనం మన కుటుంబాల విషయంలో ఒక ప్రణాళికతో పోవద్దా?" అన్నాడు.

"నిజమే! మనకు దేవుని వలన నిర్ణయింపబడిన ఆదాయమును బట్టి అప్పులు చేయకుండా జీవించవచ్చును కదా?" అన్నాడు నాన్న.

"కాని కొద్దిమంది పిల్లలను కంటే ఎక్కువమంది పిల్లలకు పెట్టే దానికంటే ఎక్కువ అనుకూలము కదా!" అన్నాడు దొర.

'అనుకూలము' అంటే అర్థం కాలేదు అన్నాడు ఆలోచిస్తూ నాన్న.

''అంటే నీకొచ్చే జీతమును ఇప్పుడు ఉన్న వసతులకంటే ఎక్కువ వసతులు పిల్లలకు నీవు కల్పించవచ్చును కదా!" అన్నాడు.

"అదేమో నాకు తెలియదు కాని - నేను అప్పు చెయ్యకుండా నాకు దేవుడిచ్చిన వసతులతో సమృద్ధిలో ఉన్నాను" అన్నాడు నాన్న.

"ఏమైనా పెద్ద సంతానం వలన ఎక్కువ కష్టాలు పడవలసివస్తుంది" అన్నాడు దొర.

నాన్న ఏమీ మాట్లాడలేదు. వాదన అనవసరము అనుకున్నాడైమో! కాని దొర ఊరుకోలేదు. "ఏమంటావు?" అన్నాడు.

"పిల్లల్ని దేవుడిస్తాడు అని నేను నమ్ముతాను. వాళ్ళని పోషించేది ఆయనే కదా!" అన్నాడు.

"నాకు ముగ్గురు పిల్లలు అందువలన నేను పిల్లలందరి మీద నా దృష్టి నిలిపి వాళ్ళను సరైన మార్గంలో పెట్టగలుగుతున్నాను" అన్నాడు దొర.

"ఒకవేళ నేను ఆ చిన్నకుటుంబము కలిగి వుండాలని అనుకొని నా భార్యకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిస్తే - దేవుని చిత్తములో నేను పెంచవలసిన బిడ్డలను నాకు వద్దని దేవునికి చెప్పినట్లే కదా!" అన్నాడు నాన్న.

''దేవుడు నీకు ఇంకాపిల్లల్ని ఇస్తాడని అనుకొంటున్నావా?" అన్నాడు దొర.

"ఇస్తే వద్దని అనను" అన్నాడు నాన్న.

"ఇంకా పిల్లలు పుడితే ఏమి చెయ్యాలని?" అన్నాడు దొర.

"దేవుని సేవకులే అవుతారు" అన్నాడు నాన్న.

"వాళ్ళు దేవునిసేవకులే అవుతారా?" అన్నాడు దొర.

"అవుతారు! జాన్‌వెస్లీ తన తల్లిదండ్రులకు పదిహేనవ సంతానము. అతని తల్లిదండ్రులు చిన్న సంసారం కావాలని కుటుంబ నియంత్రణని పాటిస్తే అంత మంచి సువార్తికుని మనం పోగొట్టుకునే వారిమి కదా! నేను నా తల్లిదండ్రులకు పదకొండవ సంతానము. మా అమ్మ నన్ను పూర్తిగా సువార్తికునిగా జీవించాలని పెంచింది. అదీకాక నా కుటుంబములోని నా పిల్లలు ఎన్నడు అనారోగ్యముతో బాధపడలేదు" అన్నాడు నాన్న.

ఆవేశంలో ఆ మాట అన్నాడే కాని ఆ మాట అనడం చాలా అపాయము అని ఆలోచించలేదు. ఆ దొరకి ముగ్గురు పిల్లలు. సంవత్సరంలో వారి అనారోగ్యము వలన నూజివీడు మిషన్ ఆస్పత్రిలో ఆరునెలలు గడుపుతాడు.

దొరగారు లేచారు. కారులో సాగనంపాము. అందరం ఇంట్లోకి వచ్చేటప్పుడు – "ఆ మాట అనకుంటే బాగుండేది" అన్నది అమ్మ.

"నిజమే! ఎలా అన్నానో నాకు తెలియదు. ఏమైతే ఏమి! దేవుని ప్రణాళిక విషయంలో రాజీపడేది ఏముంది? మానవులను అంటే మొదటి మానవులను చెయ్యంగానే దేవుడు ఆ భార్యభర్తలను – మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నింపండి అని ఆశీర్వదించాడు. అది ఆశీర్వాదమే కాదు మానవులకు దేవుడిచ్చిన ఆజ్ఞ కూడా" అంటూ లోపలికి వచ్చాడు నాన్న.

ఆయన అంతే! తను సువార్తికుడు, పాదిరి. దేవుడు తన నోటనుంచిన వాక్యము ఇతరులు ఏమను కుంటారో? అని ఆలోచించడు. వాక్యము చెప్పడమే తన విధి అని నమ్ముతాడు.

మరుసటి సంవత్సరం అక్కడ ఆ మిషనెరీతో పనిచెయ్యడం కష్టమనిపించింది. మేము హైస్కూలు చదవాలంటే మూడుమైళ్ళు నడిచి వెళ్ళాలి. పాత ఇల్లయినా, చిన్నదైనా, ఒంగోలులో సొంత ఇల్లు ఉంది. కనుక ఒంగోలులో కాపురం పెట్టి, మద్రాసులో కంపెనీలో మంచి ఉద్యోగం దేవుడిచ్చాడు. దేవుడిచ్చిన ఉద్యోగమైనా తను దేవుని సేవ చెయ్యడమే దేవుని చిత్తాన్ని నెరవేర్చడము అని అమ్మ, నాయన ఇద్దరి హృదయాల్లో ఆవేదన ఉండేది. మరి పదిమంది పిల్లలను ఎలా పోషించాలి? ఒంగోలులో కూడా మిషనెరీలు ఉన్నాయి. అయినా మిషనెరీల దగ్గర పనిచెయ్యడం అంటే దేవునిచిత్తానికి పూర్తిగా లోబడక పోవడమే అని వారి భావన. ఇప్పుడు ఒక కంపెనీ వ్యాపారం అభివృద్ధి చెయ్యడానికి రాత్రింబవళ్ళు పనిచేస్తున్నాడు. బాగానే జరుగుతుంది. బాగానే కాదు చుట్టుప్రక్కల ఉద్యోగస్తుల కంటే బాగా జరుగుతుంది. అయినా హృదయంలో ఇద్దరికి నెమ్మది లేదు. ఈ వేదనతోనే రోజులు, నెలలు గడిచిపోతున్నాయి.

మా మేనమామ రేపల్లె నుండి వచ్చాడు. ఆయనతో మాట్లాడుతూ – "ఈ కంపెనీ పనికొరకు మేము పడే కష్టం దేవుని కొరకు పడితే ఆయన పోషించలేడా?" అని అనడం విన్నాను.

"దేవుడు వచ్చి స్వయముగా నీకు ఇస్తాడా బావ?" అని మా మామ అన్నాడు.

"ఆయన ఎలా ఇస్తాడు? అనికాదు. ఆయన పోషించడా?" అన్నాడు నాన్న.

"మా మామకు కోపం వచ్చింది. నువ్వెప్పుడు ఇంతే బావ! ఒక్కచోట కుదురుగా పనిచెయ్యవు. ఇంత పెద్ద సంసారం.. ఆలోచించుకో!" అన్నాడు.

**ప్రసంగములు పత్రికలో ప్రచురణ కొరకు పంపవద్దు**

# పరలోకము - నరకము



- ఒంగోలు కబాడిపాలెంలోని జాలాది అన్నమ్మ జోసఫ్‌గారిచే పంపబడినది.

**వేయిలో ఒక్కరే :** ఆత్మలను సంపాదించకుండా తమ మట్టుకు మాత్రమే రక్షింపబడినవారు ఆ స్థలములోనే . కొరియన్ పాస్టర్ ఎంతో ఘనమైన సేవ అయితే చేసినాడు. కాని ఏవిధమైన పదార్ధములు తను పరలోకమునకు పంపలేకపోయినాడు. అందువలననే అతనుకూడా అక్కడ అందరితోపాటుగా కోడిపిల్లల షెడ్‌వంటి దానిలో ఉన్నాడు. ఇంకా అనేకమంది గొప్ప పేరుకలిగిన (భూలోకంలో) పాస్టర్లు అక్కడ ఉన్నారు.

వీరు భూలోకంలో ఉండగా ఎంతగానో గౌరవించ బడినారు. ప్రజల మెప్పును పొందినారు. దేవుని దృష్టికి ఇష్టమైన రీతి సేవ కాదు కానీ వీరే ప్రజలతో సేవలు చేయించుకొని, ప్రజల యొద్ద దేవునికి రావలసిన మహిమను దొంగిలించినారు. పరలోకములో గృహములు లేకుండా చేయబడినారు. వారికి పరలోకంలో ఎటువంటి ఫలము, మెప్పులేదు.

త్యాగము లేకుండా ప్రయాసను నష్టపరుచుకున్న పాస్టర్‌లకు అక్కడ జీతములేదు. మత్తయి 23:5-12లో వలె వారు హెచ్చరించుకుంటూ, ప్రభువు యెదుట తగ్గింపు లేని వారుగా ఉన్నారు కనుక వారికి అక్కడ అవమానకమైన పరిస్థితి యివ్వబడింది.

ఈ రీతిగా పరలోకంలో అన్ని రకములైన పరిస్థితులను గమనించిన తర్వాత నేను భూలోకమునకు తిరిగివచ్చి నాదన్నవన్నియు, నా ఆస్తి అంతయూ, నా కార్లు ఇచ్చివేసినాను. చివరకు నా వస్త్రములను కూడా నేను ఇచ్చివేసినాను. మురికిగావున్న కోడిపిల్లల షెడ్డుల మాదిరిగా ఉన్న ఆ నివాసములలో ఉన్నవారి వస్త్రములు కూడా చివరకు మురికిగానే ఉన్నాయి. ఈ 70,80 సంవత్సరాలు ఈ భూమి మీద నివసించే ఈ కాలములో ఈ కొద్ది జీవితములో మనము ప్రభువుకు నమ్మకముగా, ఇష్టులముగా ఉంటేఆ అవమానకరమైన పరిస్థితిని తప్పించుకుంటాము.

అందమైన గృహాలను పరలోకంలో సంపాదించు కోవాలంటే ముందుగా మనము అనేకులను ప్రభువువైపుకు నడిపించగలగాలి. నీవు బలముగా వారి రక్షణకొరకు ప్రార్ధిస్తున్నప్పుడు ఎక్కువైన పదార్ధమును నీవు నీ గృహము కొరకు పంపిస్తున్నావనియు, వారిని విడిచిపెట్టక, వదలక వారి విషయమై నీవు జాగ్రత్త వహిస్తే, అలానే అవసరతలలో ఉన్నవారికి వారి అవసరము విషయమై ఉదాహరణకు వస్త్రములు కావలసిన వారికి వస్త్రములు, బైబిల్స్ లేనివారికి బైబిల్స్, అలానే ఎవరికైనా కళ్ళద్దాలు అవసరమైతే ఎవరి అవసరత కొద్దీ వారికి, వారిని ప్రభువులో నడిపిస్తూ, దేవుని వాక్యముతో వారిని బలపరుస్తూంటె దేవుని వద్ద నీకొక నివాసం అక్కడ కట్టబడుతుంది.

తర్వాత దూత నన్ను ఘనమైన నివాసములలో ఉండే ఘనమైన సేవకుల యొద్దకు (దేవుని దృష్టిలో ఘనత పొందినవారు) అమెరికా సేవకు డి.ఎల్.మూడీగారు లండన్ సేవకుడు జాన్‌వెస్లీగారు ఇటలీ సేవకుడు, కొరియా సేవకుడు పాస్టర్‌చో, గన్‌నంగ్ వారుండే స్థలమునకు తీసుకు వెళ్ళినపుడు వారి నివాసములు ఎంతో ఘనమైనవిగా ఉన్నాయి. వారు తమ మరణ పర్యంతము దేవుని దృష్టికి ఘనమైన సేవ చేసినవారు.

కొరియా విశ్వాసులలోనే ఒక విశ్వాసికి గొప్ప గృహము కట్టబడింది. ఈయన ఎన్నో మందిరములు నిర్మాణం చేసినాడు. 3000 బస్తాల ధాన్యమును ఇతను పేదవారికి ఇచ్చినాడు. ఎంతోమంది పాస్టర్స్‌ను పోషించినాడు. బైబిల్ స్టూడెంట్సు ఎంతోమందికి సహాయం చేసినాడు. 65 సంవత్సరాల వృద్ధుడైన పాస్టర్‌ను తన గృహములో ఉంచుకొని పోషించినాడు. అయితే భూలోకంలో ఉన్నప్పుడు తన సొంత సంఘస్తులే అతనిని వెలివేశారు. కానీ దేవుని దృష్టిలో అతను ఘనుడుగా ఉన్నాడు కనుక అతనికి గొప్ప గృహము కట్టబడింది.

ఈ లోకపు ఒకదూత పెద్దగా చెప్పడం నేను విన్నాను. పదార్ధములు వస్తూ ఉన్నాయి అని. ఈ

పదార్థములు ఒక చిన్న చర్చిలోని ఒక స్త్రీ వద్దనుండి ఈమె దినదినము పరలోకమునకు పదార్థములను పంపుతుంది. ఆమె పేదరాలయినా ప్రతిదినము ఉదయమునే వచ్చి మందిరమునకు 87 మంది రక్షణకొరకు ప్రతిదినము ప్రార్థిస్తూ మందిరమును శుభ్రం చేస్తూ ఉంటుంది.

వేరొకదూత బిగ్గరగా చెప్పడం విన్నాను. ఆమె కుమార్తె కొద్ది ద్రవ్యము తన యొద్ద ఉన్నది తాను తీసుకోకుండా తన తల్లికి ఇచ్చినది. చర్చి పాస్టర్‌గారికి ఐదు కోడిగ్రుడ్లు, మేజోళ్ళు కొన్నది. చిన్నదిగా అర్పించినను, ఆమె తనకున్నదంతా ఇచ్చినది కనుక ప్రత్యేక పదార్థముగా పరలోకంలో ఆమెకు గృహం కట్టబడింది.

చర్చి నిర్మాణములు చేసిన వారికి కూడా గొప్ప గృహములు అక్కడ ఉన్నాయి.

అలాంటివారిలో కొరియా దేశానికి చెందిన సంఘపెద్ద 'ఛో' గారు ఉన్నారు. మరి నా నివాసం సంగతి ఏమిని నేను దూతను ప్రశ్నించగా, ఎంతో బ్రతిమాలినపుడు ప్రభువు అనుమతి దొరికింది.

అయితే ఎంతో దూరము రథములో ప్రయాణించాక, గోడలులేని వట్టి పునాదులు మాత్రమే ఉన్న గృహమును చూపించినారు.

నేను పెద్దగా అరిచినాను. నాకు ఈలాగున జరగడం ఏమిటి? కొరియన్ యుద్ధ సమయంలో నాకున్న ఒకే ఒక ఇంటిని అమ్మి చర్చి కట్టించాను. ఇప్పుడు ఈ చర్చిలో 5000మంది వస్తున్నారు. ఎన్నో పుస్తకములు వ్రాశాను. పరిశుద్ధాత్మ చేత ప్రేరేపించబడి, ఒక పుస్తకం ఎంతగానో ప్రచురించబడి ఆ డబ్బుతో క్రైస్తవ పాఠశాలలు నిర్మించాను. ఆ పాఠశాలలో 240 మంది బైబిని స్టూడెంట్స్ ఉన్నారు. 400 మంది పేదపిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నాను. పేద పిల్లలకు, విధవరాండ్రకు నేను వసతి గృహములు కట్టించాను. ఈవిధముగా ఎంతో డబ్బు ఖర్చుపెడుతున్నాను. కాబట్టి నా పరలోక గృహం ఇలా పునాదులతో మాత్రము ఉండడం ఏమిటి? నేను చాలా నిరుత్సాహంతో ఉన్నాను.

అపుడు దూత నాతో ఇలా అంది – పరలోకంలో అద్భుతమైన గృహంలో ఉండడానికి నీవు తగినవాడవు కాదు. ఎందుకంటే లెక్కలేనన్నిసార్లు నీవు మనుష్యుల చేత గౌరవించబడినావు. నీవు ఏదైనా దైవకార్యము చేసినపుడెల్లా నీవు ఘనపరచబడేవాడివి. కాబట్టి నీ కార్యములన్నీ వ్యర్థమైపోయాయి.

కొన్ని గదులలో ఉన్న నా నివాసమును చూస్తూ (పునాదులు మాత్రమే) ఈ గదులన్ని ఎవరికి? అని అడిగాను. నాకు నలుగురు పిల్లలు ఉన్నారు అన్నాను. అయితే దూత అవన్ని కూడా నీ పిల్లలకు కాదు. అయితే ఎంతమందిని నీవు దేవుని వైపుకు మళ్ళించావో నీ వాక్యము ద్వారా వారికొరకు అని చెప్పినాడు. ఒకవేళ నీవు ఎక్కువ పదార్థములు పంపుతావేమో అనే ఉద్దేశ్యంతో నీ ఇంటి గదులు పూర్తిచేయబడలేదు అని దూతలు నాతో చెప్పినారు.

నా గదిలోకి నేను ప్రవేశించినపుడు రెండు సర్టిఫికేట్స్ అక్కడ వ్రేలాడదీయబడడం నేను చూశాను. ఒకటి – నేను 18 సంవత్సరాల వయస్సులో ఉన్నపుడు క్రిస్మస్ దినమందు ఒక వృద్ధుడు చలితో వణుకుతున్నపుడు నా వస్త్రము గౌను తీసుకొని ఆయనకు ఇచ్చివేసిన సంఘటనను బట్టి ఇవ్వబడిన ప్రశంశా పత్రము. రెండవది – ఒక వృద్ధునికి కొద్ది డబ్బుతో రొట్టెను కొని ఇచ్చినపుడు ఇవ్వబడిన ప్రశంశా పత్రము. ఎంత డబ్బు ఖర్చు పెట్టినావు అనేది కాదు ముఖ్యము. ఎంత విశ్వాసముతో ఆ కార్యాలు చేశావు అనేది మాత్రమే.

తిరిగి భూమి మీదకు వచ్చే సమయంలో దూతలు నాతో 'దిగులు పడవద్దు, అందమైన గృహము కట్టబడాలంటే ప్రభువు నీతో చెబుతూ ఉన్నారు. భూమి మీదకు నీవు వెళ్ళిన తర్వాత ఇక్కడ విషయములు అన్నిటిని, పరలోకమును గురించి, నరకమును గురించి ప్రజకు వివరముగా చెప్పాలి. అలానే అక్కడ భూమి మీద స్త్రీలకు (సేవచేసేవారు వాక్యము బోధించేవారు) వారి కొరకు నీవు కొన్ని గృహాలు నిర్మించాలి. నమ్మకముగా నీవు ఈ కార్యములు జరిగిస్తే తప్పకుండా నీవు పరలోకంలో ఒకమంచి గృహమును పొందుకుంటావు.



(సశేషం)

## 3 వ పేజి తరువాయి భాగం

అనాధలను ఆదరించే ఉద్యోగం చేస్తున్న యవ్వనస్థుడైన ఒక గొప్ప వ్యక్తిని నేను చూడాలనుకున్నాను. నా ప్రక్కన వస్తున్న వ్యక్తి మనం చూడబోతున్న వ్యక్తి యొక్క ఖర్చు రోజుకు యాభై వేలకు పైనే ఉంటుంది. ఆయన ప్రయాణం చేసే కారు పదిహేను లక్షలు అన్నాడు. నేను వెంటనే వెనుదిరిగి వచ్చేశాను. అతను అనాధులను చాకవచ్చును. పోషించవచ్చును. కాని అతను తన సంతానానికి ఖర్చు చేసే డబ్బు – విదేశాల నుండి పంపించిన వారు దేవుని ప్రేమించి దాతృత్వము గల మధ్య తరగతి మనుష్యులేనని గ్రహించలేదు.

దేవుడు మన చేతిలో పెట్టిన సంపద ఇతరులకు పంచి పెట్టడానికేగాని మన స్వార్ధానికి వినియోగించుకుంటే ఆ వ్యక్తి హృదయంలో దేవుని శాంతి ఉండదు. శరీరానికి దేవుడిచ్చే స్వస్థత ఉండదు.

బొబ్బిలిలో ప్రభువు బిడ్డ 85 సం॥ల శర్మగారికి చాలా ఆస్తి ఉన్నది. ఆయన ఒక్కడే ఊరికి దూరముగా తన మామిడి తోటలో ఓ అనాధ శరణాలయమును, ఒక వృద్ధాశ్రమమును తన కొరకు ఓ సామాన్యమైన గృహము నిర్మించుకొని జీవిస్తున్నాడు. ఓరోజు ప్రక్కనున్న పట్టణంలోకి వెళ్ళడానికి డ్రైవర్‌ని కారు తెమ్మన్నాడు. ఆ కారు పాత అంబాసిడర్. కారులో కూర్చున్నాము.

'ఏంసార్! చాలా పాతకారు వాడుతున్నారే?' అన్నాను.

'ఇది నడుస్తుందిగా' అన్నారు శర్మగారు.

'మీలాంటి వారు లక్షల ఖరీదైన కారుల్లో తిరుగు తున్నారుగా' అన్నాను.

'దట్ ఈజ్ ద ఎండ్ ఫర్ దేర్ స్పిరిచ్వల్ లైఫ్' అన్నాడు. (వారి ఆత్మీయ జీవిత అంతమునకు అది మొదలు) అన్నారు ఆయన. ఆయన ఆత్మీయ జీవితంలో జీవమిచ్చేది – బీదల యెడల ప్రతి స్పందనయే!

కొర్నేలి యొక్క ప్రార్ధనలకు జవాబుగా ఆయనను దర్శించిన దేవదూత – కొర్నేలి! అని పిలిచాడు. కొర్నేలి అతని వైపు చూచి భయంతో 'ఏమిటి ప్రభూ!' అన్నాడు. అప్పుడు దూత 'నీ ప్రార్ధనలు, పేదవాళ్ళకు నీవు చేస్తున్న దానములు దేవుడు గుర్తించాడు' అని చెప్పాడు. ప్రార్ధనలు చేసేవాళ్ళు ఈలోకంలో కోకొల్లలు. కాని పేదలకు దేవుడు ఏర్పరచిన మోతాదులో దానధర్మాలు చేసేదెందరు? దేవునికి తెలుసు. వారి దగ్గరకు ప్రభువే వస్తాడు.

జక్కయ్య హృదయంలో తను చేస్తున్న వృత్తి మంచిది కాదని తెలుసు. పేదలకు సహాయం చెయ్యాలని హృదయపూర్వకముగా కోరుకున్నాడు. అతని హృదయంలోని ఆలోచనలు ఎరిగిన యేసు అతనిని చూచి 'జకర్యా! త్వరగా దిగు. నేను నేడు నీ ఇంట ఉండవలసి ఉన్నదని' చెప్పి అతనితోపాటు అతని ఇంటికి వెళ్ళి తను అన్యాయంగా ఎవరి దగ్గర ఎంత తీసుకున్నాడో దానికి నాలుగంతలు చెల్లించి, పేదలకు దానధర్మాలు చేయించి మరీ వెళ్ళాడు. మత్తయి 25వ అధ్యాయములోని విధంగా మనం దేవుని రాజ్యంలో ప్రవేశించాలన్న కోరిక మన హృదయంలో కలిగినప్పుడు హృదయాలను పరిశీలించే దేవుడు మన వద్దకే వచ్చి – మనతో మన ఉద్దేశ్యాలు కార్యాచరణలో జరిగేటట్లు చేస్తారు.

ఒకరోజు దైవజనుడైన శాంతవర్ధన్‌గారితో మాట్లాడుతూ 'మీరీవిధముగా డబ్బులు ఇతరులకు ఇవ్వడానికి కారణమేమిటి?'అన్నాను.

our giving should not be need oriented but God oriented it should be moved by God.

మనం ఇతరులకు ఇచ్చేది వారి వారి అవసరాలను బట్టి కాదు గాని దేవుని నడిపింపు ప్రకారము జరగాలి అన్నాడు.

**స్మృత్యంజలి**

**2012 ఆగష్టే 19వ తేది సాయంత్రం 6:25 ని॥ లకు మన ఆత్మీయ సహోదరుడు బ్రదర్ పి.పి.జోబ్ గారు హంగేరి దేశంలో ప్రభువు నందు నిద్రించినారు.**

**దేవుడు వారి పరిచర్యను ఇంకను ఆశీర్వదించాలని... వారి సహవాసపు వారికి ఆదరణ కలగాలని ప్రార్థిస్తున్నాము.** ఇట్లు
ఎడిటర్

# నా స్వప్నము

**– లియో టాల్‌స్టాయ్**

ఆమె కుమార్తెగా ఇంకెన్నడును మనుగడలో లేదు. అర్థమయిందా? ఆమె ఇక లేదు. అయినను ఆమె ఇతరుల దయాదాక్షిణ్యములతో బ్రతకటానికి కుదరదు. అందువలన ఆమె తన కిష్టమైన రీతిలో బ్రతకగలగాలి. కాని ఆమెను గురించి నేను ఆలోచించలేను. ఆమె ఇప్పుడున్న భయంకర స్థితిని ఊహించలేను... ఊహించలేను... అని కండ్లు పైకెత్తి తన కంటె పది సంవత్సరములు పెద్దవాడైన తన సోదరుడు ప్రిన్సు పీటర్‌తో అన్నాడు. ప్రిన్సు పీటరు రష్యాలోని ఒక ప్రాంతానికి గవర్నరుగా ఉన్నాడు. ఈ మాటలు ప్రిన్సు మైకెల్ ఇవానోవిచ్ అన్నాడు. మైకెల్ కుమార్తె ఒక సంవత్సరం క్రితం ఇల్లు వదిలి వెళ్ళిపోయి ప్రస్తుతం ఈ పట్టణంలోనే జీవిస్తున్నదని తెలుసుకొనినప్పుడు అతని హృదయం పగిలిపోయింది. సెంట్ పీటర్ బర్గ్ నుండి వచ్చిన తన పెద్ద అన్నతో ఇప్పుడు మాట్లాడుతున్నాడు.

ప్రిన్సు మైకెల్ పొడవుగా చక్కగా ఆహంభావిగా ఆకర్షణీయముగా కనబడుతాడు. అతని భార్య ఎప్పుడు చిర్రు బుర్రు లాడుతూ అతనితో చిన్నదానికి పెద్దదానికి తగువులాడుతూ ఇంట్లో ఎవరిని నెమ్మదిగా ఉండనివ్వదు. ఒక కుమారుడు ఉన్నాడు. అతను చేతినిండా డబ్బు తీసుకొని వెళ్ళి జులాయిగా తిరుగుతూ డబ్బు ఖర్చు పెడుతుంటాడు. ఇద్దరు కుమార్తెలలో, పెద్దది చక్కగా పెండ్లి చేసుకొని భర్తతో జీవిస్తున్నది. చిన్న కుమార్తె 'లిసా' అంటే తనకెంతో ఇష్టం, ప్రేమ. కాని ఆమె సంవత్సరం క్రితం ఎటో వెళ్ళిపోయి ఓ బిడ్డతో తిరిగివచ్చి ఈ పట్టణంలోనే జీవిస్తున్నదని విన్నాడు.

లీసా అసలు ఎందుకు ఇల్లు వదిలి వెళ్ళింది, ఆమె బిడ్డకు తండ్రి ఎవరు? అని తన అన్న పీటర్‌ని అడగాలను కున్నాడు. కాని అడుగలేదు.

పీటర్ భార్య తన మర్దిని పరామర్శించాలను కున్నది. కాని అతని కండ్లలో కనిపించే వ్యధను చూసి మౌనంగా ఉండిపోయింది. మధ్యాహ్నం భోజనాలకు కూర్చున్నప్పుడు మైకెల్ ఏమి జరగనట్లుగా స్నేహితులతో బంధువులతో ఉల్లాసంగా కనిపించాడు.

ఆ సాయంకాలము తోట దగ్గర కొంచెంసేపు ఆడుకొని తన గదిలోనికి వచ్చి ఇక విశ్రాంతిగా ఉండాలనుకోబోతుండగా తలుపుమీద ఎవరో చిన్నగా తట్టారు. ఎవరది? అన్నాడు.

నీ వదినని, మిఖాయేల్! అన్నది. మైకెల్ లేచి నిలుచుని రండి! అన్నాడు. అతని వదిన – ఆమె చక్కనిదే కాని తల వెంట్రుకలు సరియైన పద్ధతిలో ఉంచుకోదు. ఆమె ఎప్పుడు అన్యమనస్కురాలై ఉంటుంది. ఆమె మాట్లాడే మాటలు ఎన్నడు అప్పటి పరిస్థితులకు అనువుగా ఉండవు.

ఆమె కొరకు కుర్చీ వేస్తూ ఆమె వైపు చూచాడు.

నేను నీకు విసుకు కలిగించను మైకెల్! రెండు మాటలు లీసా గురించి చెబుతాను అన్నది.

సరే! మీరేది మాట్లాడినా ఒకే ఒక్కనిమిషం మాట్లాడండి అన్నాడు, ఆమె వైపు చూడకుండా.

మైకెల్ లీసా మీద దయ ఉంచు – ఆమె కూడా మానవ మాత్రురాలేకదా! ఆమె నీ కుమార్తె అన్నది.

ఆ మాట నిజమే! ఆమె నాకెంతో ప్రియమైనది. ఇప్పుడు ఆ సంగతి ఎందుకు? అన్నాడు.

మైకెల్ ఆ అమ్మాయిని ఒకసారి పలకరించు. అసలు తప్పంతా...

వెంటనే జేవురించిన ముఖంతో 'దయచేసి ఇక ఆపండి. ఇప్పటికే నేను చాలా కృంగిపోయి ఉన్నాను. ఇకముందు ఆమె ఎవ్వరి సహాయము లేకుండా నాతో ఇకముందు ఎటువంటి సంబంధం లేకుండా జీవించగలిగిన డబ్బు ఆమెకిస్తాను. అంతే! అన్నాడు కోపంగా.

నీ భార్య కూడా నీలాగే ఆలోచిస్తున్నది అన్నది దీనంగా.

అంతే! అంతే! అన్నాడు. ఆమె మౌనంగా కొంచెం సేపు నిలుచున్నది. నీవు ఇచ్చే డబ్బు అమ్మాయి నివశిస్తున్న ఇంటి యజమానురాలికి ఇవ్వవద్దు. నీ దగ్గర అడ్రసు ఉన్నదా? అన్నది.

ఉన్నది అన్నాడు.

అయితే నీవే వెళ్ళు. ఆమె... దగ్గర ఇప్పుడు ఎవ్వరు లేరు. ఆమె పరిస్థితి చూడు అన్నది.

నన్నెందుకు ఇలా హింసిస్తున్నావు? అన్నాడు మైకెల్.

ఆమె కన్నీళ్ళు పెట్టుకొని – ఆమె బహు దీనస్థితిలో ఉన్నది అన్నది.

ఆమె లేచి నిలుచుని మైకెల్‌ని చూస్తూ నువ్వు తప్పు చేస్తున్నావు అని వెళ్ళిపోయింది.

ఆమె అలా వెళ్ళంగానే మైకెల్ తన గదిలోనే అటు ఇటు తిరుగుతూ హ్హా... హ్హా అన్నాడు వేదనతో. తన స్వరము తనకే భయం పుట్టించింది. కొంచెంసేపటికి అతని అహంకారము మరలా అతనిలోకి వచ్చింది. అటు ఇటు నడుస్తూ లీసా! అన్నాడు. పుట్టిననాటినుండి ఆ అమ్మాయిని ఎంతో ప్రేమగా చూచాడు. ఎంతో ముద్దుగా పెంచాడు. అడిగినవన్ని ఇచ్చాడు. ఆమెను బాగా చదివించాడు. ముందుకాలములో వివాహమై విదేశాలలో స్థిరపడుతుంది అనుకున్నాడు. ఈ దేశములో తన ఉనికికి ఒక ప్రత్యేకత ఉన్నది. అది ఈ కుమార్తె ద్వారా ఇంకా ఎదుగుతుంది అనుకున్నాడు. ఎనిమిది సంవత్సరాల వయస్సులో చక్కని కండ్లు చక్కని తలవెంట్రుకలతో తన గదిలో ఆడుకునేది. తను కూర్చున్నప్పుడు తన మోకాళ్ళమీదకు ఎక్కి మెడమీద చేతులు వేసి లాగేది. ముఖంలో చూసి నవ్వేది. పెదాలమీద ముద్దుపెట్టేది. చక్కలిగింతలు పెట్టేది.

ఆమె ఎదిగిన తర్వాత ఆడమనిషిగా మారిన తర్వాత ఎవరైనా ఆమెను యువతిగా చూస్తే భయమేసేది. కోపం వచ్చేది. యువకులు ఆమె వైపు ఆశగా చూడడం తనకు ఇష్టం ఉండేది కాదు. ఆమె డ్యాన్సు కొరకు డ్రస్ వేసుకుంటే ప్రజలు ఆమెను చక్కనిదని అన్నప్పుడు లీసా సంతోషపడితే అవును చక్కనిదే నా కుమార్తె అనుకున్నాడు. ఆమె వివాహము కొరకు రెండు గొప్ప సంబంధాలు వస్తే ఆమె తిరస్కరించింది. అలా రెండు మూడు సంవత్సరాలు దొర్లిపోయిన తర్వాత ఆమెకు వెంటనే వివాహం చెయ్యాలన్న ఆలోచన తనలో బలంగా నాటుకున్నది. తర్వాత మరియొక గొప్ప సంబంధం వస్తే వారిముందు అవమానకరంగా ప్రవర్తించింది. అప్పుడు తనకు చాలా కోపం వచ్చింది. ఈవిధంగా వచ్చిన సంబంధాలన్నిటిని తిరస్కరించడం నేటి ఈ దుస్థితి కొరకే అని మైకెల్ హృదయం మండిపడింది.

మంచం మీద కూర్చుని ఆలోచించడం మొదలుపెడితే తన కోపం పెరుగుతున్నది. మరలా జ్ఞాపకాలు రాసాగాయి. అమ్మాయిని ఇరవై సంవత్సరాల వయస్సులో తన ఇంట్లో నివశించే పద్నాలుగు సంవత్సరాల యువకునితో సరసమాడడం గమనించి వానిని వెళ్ళగొట్టాడు. అప్పుడు లీసా తనను తన తండ్రి అన్న గౌరవం లేకుండా అసభ్యంగా మాట్లాడింది. నాటినుండి తండ్రి కుమార్తెల ప్రేమ ద్వేషంగా మారింది.

ఔను నేను సరిగానే ప్రవర్తించాను. లీసా సిగ్గు మాలిన పిల్ల అని తనలో తానే అనుకొన్నట్లుగా గొణిగాడు.

తర్వాత మాస్కో నుండి ఓ ఉత్తరం వ్రాసింది. తను ఇక ఇంటికి రానని, నన్ను క్షమించి మరిచిపోండి అని వ్రాసింది. తర్వాత తన భార్యతో మాట్లాడినప్పుడు లీసా తన మేనత్తను చూడబోయినప్పుడు ఒక స్వీడన్ వ్యక్తి ఒక దగుల్బాచిని పెండ్లి చేసుకున్నట్లుగా తెలిసింది.

గత విషయాలన్నీ తన మెదడులోనికి వచ్చినపుడు ఆమె తన హృదయాన్ని వేదనకు గురిచేసిన విషయాలన్ని గుర్తుకు వచ్చినపుడు హృదయం దద్దరిల్లిపోయింది. ఆమెను ద్వేషించసాగారు. తన వదినతో కొంచెంసేపటి క్రితం మాట్లాడిన విషయంలో తను తన కుమార్తెను ఎలా క్షమించ గలడు? తన వ్యక్తిత్వాన్నే అదోగతిపాలు చేసింది. లేచి ఒక సిగిరెట్టు ముట్టించి అటు ఇటు పచార్లు చెయ్యసాగాడు. ఇకను ఆలోచించడం అనవసరం. ఆమెకు ప్రతి నెలా ఇవ్వమని కొంత డబ్బును మా అన్నకి ఇస్తాను. నామట్టుకైతే నాకు ఏ సంభందం ఉండదు అనుకున్నాడు. మరల అతనిలో లీసామీద ఎనలేని ప్రేమ ప్రవేశించింది. వెంటనే ఆమె తనను అవమానించిన విధము లోపల ప్రేమను ఆర్పివేసింది.

--- --- ----

తన ఇరవై అయిదవ సంవత్సరములో తన జీవిత మంతా శూన్యంగా అనిపించింది. ఈ బంగళా – ఇక్కడికి వచ్చే ధనవంతులు వారి నివాస జీవితాలు అహంబావికులు

అంతా శూన్యముగా అనిపించారు. సంవత్సరాలు గడిచే కొలది ఈ విలాసవంతమైన జీవితం రాజదర్బారులో వారు పలికే ప్రగల్భాలు, సాయం సమయ డాన్సులు యువకులు వృద్ధులు కూడా బాహ్యాప్రతిపాదనలే చేసారు. అందరి హృదయాలు శూన్యమే అని తెలుసు. ఏదైనా విలువైన విషయాలు ఏదీ కనిపించలేదు. చివరికి సంగీతము కూడా సొంపుగా అనిపించలేదు. కథల పుస్తకాలు చదివిన జీవితములో సమస్యలను గురించి చెప్పారేమో వాటిని ఎదుర్కొనే విషయాలు చెప్పబడలేదు. అలా రెండుమూడు సంవత్సరాలు గడిచిపోయాయి. జీవితం మీద విరక్తి కలిగింది. చనిపోవాలనిపించేది.

దానధర్మాలు చేస్తే మనసు నెమ్మది అన్నారు. కాని దానధర్మాలు చేసేవారంతా వారికి మిగిలిందే ఇస్తున్నారు. గొప్ప కొరకు ఇస్తున్నారు కాని హృదయానందం పొందలేక పోతున్నారని గుర్తించింది. నిజమైన జీవితాన్ని జీవించేవారు ఎవరు కనబడలేదు.

తన జీవితంలో మాధుర్యం అనిపించిందల్లా తన కంటే చిన్నపిల్లవాడైన "కోక' దగ్గరే. అతను యదార్థపరుడు. నిజాయితీగా మాట్లాడేవాడు. అతను వెళ్ళిపోయిన తర్వాత జీవితమంతా నిరాశనిస్పృహలే. అటువంటి పరిస్థితులలో ఫిన్‌లాండ్‌లోని ఆంటి దగ్గరకు వచ్చింది. ఆ క్రొత్తదనము క్రొత్త మనుష్యులు. తన తండ్రి ఇంటి వద్ద ఉన్న పరిస్థితులకు వ్యతిరేకముగా ఉండి తనకు ఎంతో ఆహ్లాదకరముగా అనిపించింది.

ఇదంతా ఎలా జరిగిందో చెప్పలేము కాని ఆ ఆంటి ఇంట్లో మరొ స్వీడెన్ దేశీయుడు ఉన్నాడు. అతను తన పనివిషయం తన ప్రజల విషయం ఇంకా అతను చదువుతున్న కొత్త స్వీడన్ నవల విషయం చెబుతుండేవాడు. మరి ఎలా జరిగిందో తెలియదు కాని నవ్వులు, కండ్లతో మాట్లడుకోవడం, విడువలేని అనుబంధము వలె నిలిచిపో సాగాయి. ఈ ధరిత్రిలో మనకు తెలియని భావాలు ఒక్కోసారి అవే బయటికి వస్తాయి. ఎలా వచ్చాయో మనల్ని ఎలా వశపరచుకున్నాయో చెప్పలేము.

అతనితో మాట్లాడే ప్రతిమాట, ఎంతో మృదువుగా ఉండే పాటలు కూడా కలిసి పాడుకొనే వరకు వచ్చింది.

మాటలు ఆగిపోయిన తర్వాత కండ్లు మాటలాడు కోవడం ప్రారంభించాయి. కండ్లు మనసులను మనుష్యులను ముడివేయగలవు. వారికి కనపడని కళ్ళు వారిని బంధించాయి. ఆమె మొదట్లో భయపడింది. ఏడ్చింది. ఆ బంధకాలను తప్పించుకోవాలనుకొనే కొలది అవి మరీ బలపడ్డాయి. ఓడిపోయి అతని ఒడిలో పడిపోయింది. తనకు తల్లి ప్రేమ తెలియదు. తండ్రి తనను దూరంగా ఉంచాడు. తనలోని ప్రేమాభిమానాలు ఇక్కడ మరొకరి మీదకు ప్రవహించాయి. కాని రోజులు గడిచేకొలది అతనిలో తను కోరుకొనినవేమీ కనిపించలేదు. అయినా అలానే అతుక్కు పోవాలనిపించింది. కాని అతను దూరంకాసాగాడు.

ఒకరోజు అతను వచ్చాడు. అతని కండ్లలోకి చూసి నవ్వింది. నేనేమి భయపడడం లేదు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనగలను అన్నట్లు నవ్వింది. కాని తన హృదయంలో ఇక పరిస్థితులే లేవు అనుకున్నది. అతని వద్ద తాను ఆశించినదేది లేదని గ్రహించింది. మీ తల్లిదండ్రులతో మన పెండ్లి విషయం మాట్లాడు అన్నది. అతను సరే అన్నప్పటికి అది సహజముగా లేదు. మరునాడు దాటిన తర్వాత అతని వద్దనుండి జవాబు వచ్చింది. తన తండ్రితో వివాహ విషయం మాట్లాడడం సాధ్యము కాదు ఎందుకంటే తనకు ఇంతకుముందే వివాహము జరిగిపోయింది. భార్య తన నుండి దూరంగా వెళ్ళిపోయింది అని వ్రాశాడు. అతను మరలా వచ్చినపుడు తను అన్నిటికి సిద్ధపడి ఉన్నానని నీకు వివాహము అయినా నిన్ను విడువనని చెప్పింది. మేము చాలా బీదవారము. నిన్ను సుఖపెట్టలేను అన్నాడు.

నేను ప్రతి సమస్యకు సానుకూలముగా ప్రవర్తిస్తాను కాని ఇలా నెలలో రెండుమూడు సార్లు మనం కలుసుకొనేకంటే బీదరికమే మంచిది. కనుక నన్ను ఇక్కడనుండి తీసుకొనివెళ్ళు అని వ్రాసింది. తర్వాత లీసా తన చిన్ననాట గడిపిన పీటర్స్‌బర్గ్ వచ్చింది. అతను త్వరలో వచ్చి కలుసుకుంటానని ఉత్తరం వ్రాశాడు. ఇక అదే ఆఖరి ఉత్తరం.

ఇప్పుడు త్వరలో తను తల్లి కాబోతున్నదని తెలుసు

కున్నది. ఈ భావనేదో తన అంతరాత్మలోనికి తొంగిచూసుకొన్నది. ఇతరులు తనను ఏమనుకుంటారో అనే దానికంటే తన జీవితాన్ని తానే పరీక్షించసాగింది. ఇతరులు ఏమనుకుంటారో అని. చావడం తేలికే. తను ఈ ప్రపంచానికి వ్యతిరేకము కనుక తనే ఈ లోకంలో నుండి వెళ్ళిపోవాలనుకుని ఆత్మహత్యకు ఆలోచించింది.

ఒకరోజు తన పరుపు కుట్టుకుంటూ తన తల్లి బాధ్యతారహిత జీవితం, తన తండ్రి ప్రేమను గురించి ఆలోచిస్తూ చాలాసేపు గడిపింది. తను ఆత్మహత్య చేసుకోవడం అసాధ్యము అనుకున్నది. అన్ని ఆలోచిస్తూ చాలాసేపు గడిపింది. చివరికి అన్ని మరిచిపోవాలంటే విముక్తి పొందాలంటే ఆత్మహత్య శరణ్యం అనుకున్నది.

మరలా తన తండ్రి గుర్తుకువచ్చాడు. తను ఆత్మహత్య ఆయనను ఎంత కృంగదీస్తుందో అని ఆలోచించింది. తన చేతిలోని విషం సీసాను గిరాటు వేసింది. తను నడిచివచ్చిన దారి, దానిలోని జ్ఞాపకాలను మర్చిపోవడానికి ప్రార్థించడం మొదలుపెట్టింది. అయినా తన ప్రార్థన తనకు నెమ్మది కలుగజేయలేదు. తన ఈ నరక బాధకంటే తనను గురించి తన తండ్రి పడే బాధ చాలాగొప్పది అని గ్రహించింది. ఆత్మహత్య విషయం ఆలోచించడం మాని ఈ పట్టణం నుండి తనను ఎవ్వరూ గుర్తించని మరో మారుమూల గ్రామానికి వెళ్ళిపోవాలని ఆలోచించసాగింది. అక్కడ తన బిడ్డతో దుఃఖకరమైన భారమైన జీవితాన్ని గడపాలి అనుకున్నది. ఇప్పటికి నాలుగు నెలల నుండి ఒక మంత్రసాని ఇంట్లో నివశిస్తు అనుకోకుండా తన పెదనాయన తన వద్దకు వస్తున్నట్లుగా గ్రహించింది. కనుక తను త్వరగా ఇక్కడి నుండి వెళ్ళిపోవాలని తయారైంది.

మరుసటి రోజు ఉదయాన్నే మిఖాయేల్ సిద్ధపడ్డాడు. తన అన్న గదిలోకి వెళ్ళి తన కుమార్తె పోషణ కొరకై వ్రాసిన చెక్కును ఆయనకు ఇచ్చాడు. సాయంకాలము తన అన్న వెళ్ళే సమయానికి ఆయన ఇక్కడ చేయవలసిన పనులన్ని ముగించుకోగలడు అని నిశ్చయానికి వచ్చి టిఫిన్ చెయ్యడానికి భోజనశాలకు వచ్చాడు. అక్కడ తన వదిన ఉన్నది. ఆమెతో ఏమి మాట్లాడలేదు. కాని ఆమె భయంభయంగా తనవైపు చూస్తున్నదని గ్రహించాడు. బయటకు వచ్చాడు.

అతని వదిన అతని వెంబడి బయటకు వచ్చింది. దగ్గరలో ఉన్న పార్కులోకి వెళ్ళు మిఖాయేల్ అక్కడ చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆ పార్కు అన్నింటికి దగ్గరే అన్నది జీరపోయిన గొంతుతో. ఆమె చెప్పినట్లుగానే పార్కుకు వెళ్ళాడు. అక్కడ కూర్చొని కొంచెంసేపు ఆలోచించాడు. మా వదినకు నామీద కొంచెం కూడా జాలిలేదు అనుకున్నాడు. నా దుఃఖాన్ని కొంచెం కూడా ఆమె గ్రహించలేదు. ఆమెతో నాకేమిటి అనుకున్నాడు. తర్వాత లీసా గుర్తుకువచ్చింది. ఈ వయస్సులో నాకు ఇంత దుఃఖము కలుగజేసింది. ఈ దుఃఖము నా జీవితాన్ని కుదించి వేస్తుంది. తన కుమార్తెను గురించి పట్టణస్తులు మాట్లాడుకొనే విధానాన్ని ఆలోచించినపుడు అతనిలో క్రోధము పెరిగింది. కాని అప్పటికే అందరికి తెలిసి పోయింది అని అతనికి తెలియదు. తన క్రోధాన్ని లీసా మెదడులోకి పంపించి తన స్థితిని కొంత మెరుగుపరచుకో వచ్చును అనుకొన్నాడు. తను ఇంటినుండి బయలుదేరే టప్పుడు తన వదిన ఈ పార్కు అన్నింటికి దగ్గరే అనిన ఆ మాట గుర్తుకు వచ్చింది. తన కుమార్తె లీసా ఇక్కడికి దగ్గరలో నివశిస్తుంది అని జోబిలో నుండి చిన్న అడ్రసుల పుస్తకం బయటకు తీసి ఆ అడ్రసు సిల్వర్ స్ట్రోవా కుకోనక్యావీధి అబ్రానోల్ ఇల్లు . ఈపేరుమీద లీసా ఇప్పుడు నివశిస్తున్నది అని పుస్తకం జోబిలో పెట్టుకొని అటు వెళ్తున్న టాంగాని పిలిచాడు.

ఆ ఇంటి వద్ద టాంగా దిగి తలుపుతట్టాడు. మంత్రసాని వచ్చి మీకెవరు కావాలి? అని అడిగింది. సిల్వస్టోన్ ఇక్కడ నివశిస్తున్నదా? అని అడిగాడు. ఆమె ఇప్పుడే ఈ మూలనున్న దుకాణం వద్దకు వెళ్ళింది. ఒక నిమిషంలో వస్తుంది. దయచేసి లోపలికి వచ్చి కూర్చోండి అన్నది.

ఆప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. ప్రక్క గదిలో నుండి చిన్నపిల్లవాని పెద్ద ఏడుపు వినిపించింది. ఆ ఏడుపు అతని కడుపులో దిగిన కత్తివలె అనిపించింది.

మారియా ఆ మంత్రసాని గబగబ ఆ గదిలోకి వెళ్ళి ఆ బిడ్డను జోకొట్టింది. బిడ్డ నిద్రపోయినట్లుంది.

మారియా బయటికి వచ్చి ఆ బిడ్డ ఆమెది.. అని మైకెల్‌ను చూసి ఇప్పుడే వస్తుంది. మీరు ఆమె స్నేహితులై యుంటారు అంటూ తన గదిలోకి వెళ్ళింది. ఔను స్నేహితుడనే! అని లేచి నేను తరువాత వస్తే బాగుంటుందేమో అని బయటకు నడువబోయాడు. ఇప్పుడు ఈ పరిస్థితులలో లీసాను కలవడం మంచిది కాదేమో అనుకొని వస్తుంటే లీసా స్వరము వినబడింది.

మారియా! నేను బయటకు వెళ్ళినపుడు బిడ్డ ఏడ్చాడా? అని తలతిప్పి తన తండ్రిని చూసింది. ఆమె చేతిలోని ప్యాకెట్ క్రింద పడిపోయింది. నాన్నా! అని ఏడ్చి వణికిపోతుంది. మైకెల్ నిశ్చలంగా నిలబడిపోయాడు.. ఆమె సన్నగా అయిపోయింది. ఏమి చెయ్యాలో ఏమి మాట్లాడాలో అర్ధం కాలేదు. తనకు జరిగిన అవమానము అతనికి గుర్తు రాలేదు. ఆమెను చూడగానే దుఃఖము కలిగింది. ఆమె సన్నగా ఉందని దుఃఖము కలిగింది. ఆమె ధరించిన ముతక గుడ్డలను చూసి దుఃఖము కలిగింది.

నన్ను క్షమించు నాన్న అంటూ ఏడుస్తూ దగ్గరగా వచ్చింది. క్షమించు! క్షమించు అంటూ ఏడుస్తూ ఆమెను కౌగిలించుకొని ముఖం చేతులు కండ్లు ముద్దుపెట్టుకొని తన కన్నీళ్ళతో తడిపివేశాడు.

ఆమె మీద జాలితో తననుతాను తెలుసుకున్నాడు. తను ఎట్లున్నాడో ఆమె ఎడల తన హృదయం ఎలా ఉండినదో తన అహంకారము వలన కోపము వలన తన హృదయంలో ఎంత తప్పుచేసాడో గ్రహించాడు. తను ఆమెను క్షమించడం కాదు గాని తన కుమార్తే క్షమించాలి. తన చిన్న గదిలోకి తన తండ్రిని తీసుకొని వెళ్ళింది. తన బిడ్డ విషయం తను ఏమి మాట్లాడలేదు. కాని తను ఎలా బ్రతుకుతున్నదో చెప్పింది.

ఈ ఊర్లో ఉంటానో లేదో ఇంకా నిశ్చయించుకోలేదు అని చెప్పింది. ఆ విషయం తరువాత మాట్లాడుదాము అని ఆయన అంటుంటే బిడ్డ ఏడ్వడం మొదలుపెట్టాడు. లీసా తన తండ్రి ముఖంలోకి చూస్తూ అలానే నిలబడిపోయింది.

ఇప్పుడు బిడ్డకి పాలివ్వాలేమో అమ్మా అన్నాడు. ఆమె అటు బిడ్డవైపు తిరిగింది. ఇప్పుడు తను ప్రాణంగా చూసుకొనే తన బిడ్డను తండ్రికి చూపించాలా? అనే ఆలోచన మెరిసింది. తన తండ్రిని చూసింది. ఆయన బిడ్డ విషయంలో కోపంగా ఉన్నాడా? కాని ఆయన ముఖంలో కోపం కనిపించలేదు. కాని విచారం కనిపించింది.

సరే వెళ్ళు వెళ్ళమ్మా! రేపు నేను మరలా వస్తాను. అప్పుడు ఆలోచిస్తాను అమ్మడూ! వెళ్ళివస్తాను అని ఇంక ఏదో అనబోతే గొంతులో కఫం అడ్డం వచ్చింది.

తన అన్న గదికి రాగానే ఆయనగబగబ మైకెల్ వద్దకు వచ్చాడు.

మంచిది అన్నాడు.

మంచిదే – ఏమి జరుగలేదు.

ఆమెను చూశావా? అన్నది వదిన అతని ముఖం చూస్తూ. ఏదో జరిగింది అనుకొన్నది.

ఔను అని ఏడ్వడం మొదలుపెట్టాడు. నేను పెద్దవాడినైపోయాను. బుద్ధిహీనుడనయ్యాను అన్నాడు. తన దుఃఖాన్ని దిగమ్రింగుతూ.

లేదు నీవు చాలా జ్ఞానవంతుడివి, మంచివాడిని మైఖేల్ అన్నది వదిన.

**స్మృత్యంజలి**

**2012 ఆగస్టు 8వ తేది సాయంత్రం 7:30 ని॥ లకు మన ఆత్మీయ సహోదరుడు బ్రదర్ ఏసన్న గారు ప్రభువు నందు నిద్రించినారు.**

**దేవుడు వారి పరిచర్యను ఇంకను ఆశీర్వదించాలని... వారి సహవాసపు వారికి ఆదరణ కలగాలని ప్రార్థిస్తున్నాము.**

ఇట్లు
ఎడిటర్

## 10 వ పేజి తరువాయి భాగం

రామాయపట్నంలో పరిచయమయ్యారు. హన్నాకృప పాఠకులుగాను, వారి సాక్ష్యమును హన్నాకృపలో ప్రచురించాము. వారి కుమారుడు మైకెల్ రెండు సువార్త సంస్థలకు డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

మేము ఒంగోలులో బయలుదేరేటప్పుడు నలుగురు ప్రముఖులకు సన్మానము చేయాలనుకొన్నాము. వారిలో ప్రథముడు రెవ.డా.దాస్‌బాబుగారు. ఆగష్టు నెల 11వ తారీఖున ఆంధ్ర క్రిస్టియన్ థియోలాజికల్ కాలేజి (లోయర్ ట్యాంక్ బండ్ వద్ద) క్రిస్టియన్ రైటర్స్ సెమినార్‌కు నన్ను ఆహ్వానించారు. ఆ సభ ముగిసిన తర్వాత హన్నాకృప 13వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక వారికిచ్చి మీరు హాజరు కావాలని అడిగాను. ఆయన ఒప్పుకున్నారు. కాని ఒక్క నిమిషమైనా విశ్రాంతి దొరకని దాసుబాబుగారు ఈ సభకు విచ్చేస్తారన్న పూర్తి నమ్మకము నాకు లేకుండినది.

దాస్‌బాబుగారు ఈ కాగితం మీద వ్రాయలేనన్ని క్రైస్తవ వ్యాపకాలలో ఉండి సాయంకాలం సభాస్థలి యొక్క అడ్రసుకొరకు ఫోను చేశారు. వారు, వారి స్నేహితులు ఎడ్వర్డు (స్టేట్ గవర్నమెంటు రీజనల్ ఇంజనీరుగారు క్రైస్తవ రచయితల సదస్సుకు ఎగ్జిక్యూటివ్ కమిటి మెంబర్‌గాను ఉన్నారు) గారితో కలిసి వచ్చారు.

సభ ప్రారంభము కాగానే దాసుబాబుగారు ఎడ్వర్డు గారితో కలిసి హన్నాకృప చీఫ్ ఎడిటర్ కొడవటికంటి గారికి సన్మానము చేశారు.

తర్వాత సభ నిర్వాహకులు దాసుబాబు గారికి, హన్నాకృప ఆనరబుల్ అడ్వయిజర్ శ్రీ యడవల్లి ప్రసాద్‌రావు (పే అండ్ అకౌంట్సు ఆఫీసర్) గారికి సన్మానము చేశారు. ప్రసాద్‌రావుగారు గవర్నమెంటులో బాధ్యతగల ఉద్యోగము చేస్తూనే వందలాది మైళ్ళు తరచుగా ప్రయాణం చేసి సువార్తను ప్రకటిస్తూ ప్రభువు సేవలో చురుకుగా పాల్గొంటున్నారు. హన్నాకృపకు సలహాలు ఇవ్వడమే కాకుండా హన్నాకృప పత్రిక ప్రచురణలో విలువైన ఆర్థిక సహాయము చేస్తుంటారు. కట్టా నాగేశ్వరిగారు గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ రీజనల్‌గా పనిచేశారు. 2009లో హైదరాబాద్ కల్వరిటెంపుల్‌లో కొడవటికంటిగారి రచనలు చదివి ఆ సంవత్సరము డిశెంబరులో కొడవటికంటి గారికి చీరాలలో సన్మానము చేసి కొడవటికంటిగారి సువార్తలలోని యేసుకథ మొదటి భాగమును అచ్చు వేయించారు. తర్వాత చాలా సంవత్సరాలు హన్నాకృపను ఆదరించారు. 2012 ప్రారంభములో కొడవటికంటి గారితో నాజరు (సమ్సోను) నవల వ్రాయించి అచ్చు వేయించారు. హన్నాకృప పోషకులలో ఒకరైనారు. వారికి సన్మానము చేయబడింది.

శ్రీమతి అన్నమ్మగారు ఒంగోలులో సొంత మేనేజ్‌మెంటు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. వారికి నలుగురు సంతానము. వారి పెద్ద కుమారుడు పి.సువర్ణరాజు గారు హైదరాబాద్ బ్యాంక్ ఉద్యోగములో ఉన్నారు. వారు సువార్తలలోని యేసుకథ మూడవ భాగము ముద్రణకు ఆర్థిక సహాయము చేశారు. శ్రీమతి అన్నమ్మగారు నేటికిని చిన్నపిల్లల మధ్యలోను, స్త్రీల కూడికలోలను ప్రతి నిత్యము సేవచేస్తున్నారు. వారికి సన్మానము చేశారు. అన్నమ్మగారి పెద్ద కుమార్తె చంద్రబాల, అల్లుడు డేవిడ్ కుటుంబ సమేతముగా బొల్లారం నుండి వచ్చారు.

కర్నూలు పట్టణము నుండి వచ్చిన శ్రీ జడ్డా దేవదానముగారు ఒంగోలునుండి వచ్చిన కుమారి హేనా ప్రతిభ, సుజాత డేనియల్, హైదరాబాద్ నివాసి ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో క్రియాశీలురైన శ్రీ ఈనక్ డేవిడ్‌గారు గ్రీటింగ్స్ చెప్పారు. సభను ఒంగోలునుండి వచ్చిన రెవ.డానియేల్ గారు నడిపించారు.

దైవ వాక్యమును బంజారాహిల్సు బాప్టిస్టు సంఘ కాపరి గారైన రెవ.టి.పి.మాథ్యూస్‌బాబు గారు అందించారు.

హైదారాబాద్ ఫిలింనగర్ వద్ద ఉన్న ఇండియా క్రిస్టియన్ మిషన్ వర్షిప్ సెంటర్ నుండి శ్రీమతి ప్రకాశిని గారితో ఆనందబాబు, శేషు, జిలాని, పెద్ద బాపయ్యగారలు వచ్చారు. రెవ.కె. సంపత్ రావుగారు సినాధ్ నుండి రెవ . ప్రకాశ్‌గారు మియాపూర్ నుండి, లలితకుమారిగారు కుటుంబముతో కొత్తపేట నుండి, జ్యోతిగారు చైతన్యపురి నుండి వచ్చారు. చివరిగా విందుతో సభ ముగిసింది.

# సువార్తలలోని యేసు కథ



దీపముండగానే ఇల్లు చక్కపరచుకోవాలి. తను ఏదైనా ఒక పరిష్కారము ఆలోచించి అమలుజరిపితే తన ప్రణాళిక ద్వారా యేసును జనసమూహము ఎదుట మెస్సయ్యగా ప్రత్యక్ష పరచగలిగితే ఆ ఘనత తన ఒక్కడికే దక్కుతుంది. ఈ అదనుతో యేసును చంప చూస్తున్న ప్రధాన యాజకులతో కలిస్తే – వారికి యేసు ఒంటరిగా అంటే జనసమూహములో లేకుండిన సమయంలో తెలియపరిస్తే వాళ్ళు ఖచ్చితంగా ఆ అదనును ఉపయోగించుకుంటారు. ఈ పండుగలోనే యెరూషలేము ప్రపంచమంతటి నుండి వచ్చిన జనసమూహము ఎదుటనే ఆయన మెస్సయ్యగా కనపరుచు కుంటాడు" అని ఆలోచించసాగాడు. యూదా ఇస్కరియోతు ప్రణాళికకు శిష్యులెవ్వరు సమ్మతించరు. జలోతెదేశాభిమానియై జలోతీయులతో కలిసివుండేవాడు. ఇప్పుడు శిష్యులలో ఒకడై యేసు – మెస్సయ్య అనే సంగతి ధృవీకరించడానికి సహకరించడు.

ఎన్ని విధాలుగా ఆలోచించినా తన ప్రణాళిక సరైనది. ఇంతకంటె మంచి ప్రణాళిక ఉండదు అని నిశ్చయించుకున్న తర్వాత అతని మనస్సు నెమ్మది పొందింది. రోమీయుల సైన్యము – దేవాలయ భటులు కలిసినా యేసు ఒక మాట సెలవిస్తే?అందరు పడిపోయి చచ్చిపోతారు అని నవ్వుకున్నాడు.

ఆ సాయంకాలం బేతనియ చేరేటప్పటికి యేసు కొరకు సీమోనుగారు విందు చేశారని తెలిసింది. ఇటువంటి విందులోనే కావలసినంత మంచి ఆహారం దొరుకుతుంది. మిగిలిన సమయంలో ప్రయాణంలో ఉన్నప్పుడు ఎక్కడ మంచినీరు దొరికితే అక్కడ మూటకట్టు కొచ్చిన రొట్టెలు, వేయించిన చేపలే ఆహారం. ఒక్కోసారి అవికూడా లేకుండా ఆకలితో నడచిన సంఘటనలు కోకొల్లలు.

బేతనియ సీమోనుగారు ఒకప్పుడు కుష్ఠురోగి. అతని వ్రేళ్ళు కూడా పోయి ఉండేవంట. అయితే యేసు అతని ముట్టి స్వస్థపరచినప్పుడు అతని అవయవాలన్ని అతనికి మళ్ళీ వచ్చాయి. అతను యాజకునికి కనబడి శుద్ధీకరణ పొందినప్పటికి మార్తమ్మగారి ఇంటి వెనుక అతను నివశించే భాగములోనే ఉంటున్నాడు. మార్తమ్మ, మరియమ్మ ఆయన కుటుంబములోని వారే! అందువల్ల ఆయన ఇంటిలోనే విందుకు కూర్చున్నారు. ఇష్కరియోతు హృదయంలో తన ప్రణాళిక జయప్రదం అవుతుంది అని ఎంతో సంతోషంగా ఉన్నాడు.

✢ ✢ ✢

చిన్నతనంలోనే అమ్మ పోయింది. అప్పటినుండి అక్క మార్త తనను ఎంతో ప్రేమగా చూసింది. తన అన్న లాజరు యేసు శిష్యుడైనప్పటికి ఇంటి పనులు ఎక్కువగా ఉన్నందున ఆయన వెంబడి సంచారము చెయ్యలేదు. యేసు మొదటిసారి ఇంటికి వచ్చినప్పుడు ఆయన వదనంలో దైవత్వము తనను ఎంతో ఆదరించింది. యేసు తనకు అన్న, తండ్రి, అయినాడు. ఆయన లోతైన మర్మాలు చెప్పినప్పుడు అవి చాలా తేలికగా అర్థమయ్యేవి. ఆయన సన్నిధిలో కూర్చున్నప్పుడు సమయము ఎంతైనది తెలిసేది కాదు. ఆకలి దప్పులు దూరమయ్యేవి. ఆయన మాటలు ధ్యానించడానికి తన జీవితం సరిపోదు అనుకునేది.

యేసు అనేక గ్రామాలు పల్లెలు తిరిగి ఇంటికి వచ్చినప్పుడు ముఖ్యంగా యెరూషలేములో యూదుల పండుగలన్నిటికి ఆయన యెరూషలేము వచ్చేవాడు. ఆ దినాలలో తనకు ఎంతో వాక్యము చెప్పేవాడు. ఇతరులకు చెప్పే వాక్యం కాక తనతో ప్రత్యేకమైన విషయాలు చెప్పేవాడు. ఆ మాటలు ఆయన చెప్పేటప్పుడు ఎలా ఉన్నా ఆయన వెళ్ళిపోయిన తర్వాత తనకు భయం వేసేది. ఆయన జన్మ కన్యకనుండి ఉద్భవమైంది. ఆయన మాట పలికితే స్వస్థత. ఆయన పాదె ముట్టితే జీవం – ఒకటికి నాలుగురోజులు సమాధిలో ఉండిన తన సహోదరునికి జీవం ఇచ్చాడు.

కాని ఆయన ఒకరోజు – గొర్రెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును వచ్చితిని.

నేను గొఱ్ఱెలకు మంచికాపరిని, మంచి కాపరి గొఱ్ఱెలకొరకు తన ప్రాణము పెట్టును అన్నాడు.

మరియొకసారి - నేను దాని మరలా తీసుకొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను. ఇందువలననే నా తండ్రి నన్ను ప్రేమించు చున్నాడు అన్నాడు.

అన్న లాజరు యేసుకు శిష్యుడైన క్రొత్తలో యేసు – బాప్తీస్మమిచ్చే యోహానుగారి దగ్గరకు వచ్చినప్పుడు 'ఇదిగో లోక పాపమును మోసుకొను పోవు దేవుని గొఱ్ఱెపిల్ల అన్నాడు' అని చెప్పాడు. ఇప్పుడు ఆ మాట తలచుకుంటే భయం వేస్తుంది. ఈయన పస్కా గొఱ్ఱెపిల్లా? తన ప్రాణం పెడతాడా? మొన్నటికి మొన్న యెరూషలేము దేవాలయమును రెండవసారి శుద్ధి చేసి ప్రధానయాజకులకు పగ అయ్యాడు. ఈ విధంగా వారికి పగ అయినది ఎందుకు?

మరియకు ఏడ్పు వచ్చింది. కండ్ల వెంబడి నీరు ఆగలేదు. ప్రక్కగదిలోకి వెళ్ళి చాలాసేపు ఏడ్చింది. యేసు లోక పాపమును మోసుకొని పోవు దేవుని గొఱ్ఱెపిల్లా? ఈ ఆలోచన ఆమె హృదయంలో స్థిరముగా నిలిచిపోయింది.

నాలుగురోజులు క్రితం గలిలయ నుండి శిష్యులతో పాటుగా వచ్చిన స్త్రీలు ఎంతో సమర్పణ గలవారు. వారిలో మగ్ధలేనే గ్రామస్థురాలైన మరియ యేసు అంటే ప్రాణం పెడుతుంది. ఆమె నిద్రలో కూడా స్వామి! రబ్బూని! అని కలవరిస్తుంది. ఆమె మొదటిసారి యేసును దర్శించినప్పుడు ఆయన ముఖం చూడగానే ఆమె హృదయం ద్రవించి ఆయన పాదాల వద్ద నిలువబడి ఏడ్చిందట. తన కన్నీళ్ళు ఆయన పాదాల మీద పడ్డాయని చూచి తలముడిని విప్పదీసి తల వెంట్రుకలతో ఆయన పాదాలు తుడిచి పాదాలను ముద్దుపెట్టుకొని అత్తరు పాదాలకు పూసిందట.

ఆమె మాట్లాడుతు "గలిలయ నుండి వచ్చే దారిలో శిష్యులను దగ్గరకు పిలిచి 'ఇదిగో యెరూషలేమునకు వెళ్ళుచున్నాము. మనుష్య కుమారుని గూర్చి ప్రవక్తల చేత వ్రాయబడినవన్నియు నెరవేర్చబడును. ఆయన అన్యజనుల కప్పగింపబడును. వారు ఆయనను అవహసించి అవమానపరచి ఆయన మీద ఉమ్మివేసి ఆయనను కొరడాలతో కొట్టి చంపుదురు. మూడవ దినమున ఆయన మరలా లేచునని చెప్పాడు. కాని శిష్యులు కాని, ఆయనను వెంబడిస్తున్న స్త్రీలు కాని, ఈ విషయాన్ని అసలు పట్టించుకోలేదండి" అని చెప్పింది.

ఇప్పుడు జరుగుతున్న సంఘటనలన్ని ఇంతకుముందు ప్రభువు పస్కా పండుగలకు యెరూషలేము వచ్చిన నాటికి వ్యతిరేకముగా అనిపిస్తున్నాయి. యేసు ఈ పస్కా పండుగలో దేవుని గొఱ్ఱెపిల్ల వలె మరణించి మూడవ రోజున తిరిగిలేస్తాడు అనుకున్నది. తన హృదయం అసలు తన స్వాధీనములో లేదు అని అనుకుంది. ఈ పస్కా... ఈ పస్కా... అనుకుంది. ఇది ఆయన చిత్తానుసారంగానే జరుగుతుంది.

ఎవరును నా ప్రాణమును తీసుకొనరు. నా అంతట నేనే దానిని పెట్టుచున్నాను. దాని పెట్టుటకు నాకు అధికారము కలదు. దాని తిరిగి తీసుకొనుటకు నాకు అధికారము కలదు. దాని తిరిగి తీసుకొనుటకును నాకు అధికారము కలదు. నా తండ్రి వలన ఈ ఆజ్ఞ పొందితిని అని ఆయన చెప్పినమాట గుర్తుకువచ్చింది. ఆయన మూడవ రోజున తిరిగిలేస్తాడు. అది యదార్థము. ఆయన మాటలలో ఏది అతిశయోక్తి ఉండదు. కాని ఆయన తన ప్రాణము పెట్టే ముందు పడబోతున్న శ్రమను ఆయన ఎలా భరిస్తాడు? తనలో నుండి మూలుగు బయటికి వస్తోంది. తన గదిలోనే ఉండి చాలాసేపు ఏడ్చింది. ఆయన చెప్పినవన్ని జరుగుతాయి.

ముఖం శుభ్రంగా తుడుచుకొని హృదయాన్ని దిటపరచుకుంది. తలవెంట్రుకలు ముడివేసుకొని తలమీద ముసుగు వేసుకుంది.

తన పెట్టెలో అడుగునుండి అత్తరుబుడ్డి బయటకు తీసింది. తనకు కొన్ని సంవత్సరాల క్రితం తన బంధువు బహుమతిగా ఇచ్చిన ఆ అత్తరు బుడ్డిని ఎన్నడు ఉపయోగించాలన్న తలంపు రాలేదు. తను ఎన్నడు ఇల్లు దాటి బయటకు వెళ్ళలేదు. యెరూషలేములోని ఆరాధనకు కూడా ఒకటిరెండుసార్లు మాత్రం వెళ్ళింది. తనకు స్నేహితులు లేరు. తనకు ఇంటిలో ఉండే నెమ్మది, ఆనందం బయట ఎక్కడ కనిపించలేదు, అనిపించలేదు.

# North East West South వార్తలు

## కర్ణాటకలో క్రైస్తవులపై దాడి

**బళ్ళారి, కర్ణాటక :** కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి జిల్లా హడగలి తాలూకా వ్యాసముల్లాపుర తండాలో ఓ క్రైస్తవ కుటుంబంపై క్రైస్తవ వ్యతిరేక హైందవ మత తీవ్రవాదులు దాడిచేశారు.

దుండగులు దండోరా వేస్తూ చర్చికి వెళ్ళి విశ్వాసులను అడ్డగిస్తూ, వెళ్ళే దారులన్నిటిని మూసివేశారు. దేవేంద్ర నాయక్, అతని కుటుంబము యేసు ప్రభువుని నమ్ముకుందని దాని విషయమై పంచాయితీలో తీర్పు ఉంటుందని ప్రకటించారు. అదే రోజు దేవేంద్రనాయక్ ఏరియా పోలీస్ అధికారి గిరీష్ నాయక్‌కు ఫిర్యాదు చేసినా అతను పట్టించుకోలేదు. ఆ మరుసటిరోజు ఉమేష్ నాయక్ ఆధ్వర్యంలో యాభై మంది దుండగులు దేవేంద్ర నాయక్ ఇంటిపై దాడిచేసి అతని తల్లిదండ్రులను, సహోదరిని కొట్టుకుంటూ సేవాలాల్ ఆలయం దగ్గరకు బలవంతంగా తీసుకొని వచ్చారు. స్థానిక క్రైస్తవ నాయకులు ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దాడిచేసిన దుండగులు దేవేంద్ర నాయక్ బలవంతపు మతమార్పిడి చేస్తున్నారని ఆరోపించారు. క్రైస్తవుల రక్షణ కొరకై ఒక కానిస్టేబుల్‌ని నియమించారు. హడగలి తాలూకాలో సుమారు 450 మంది విశ్వాసులు 6 సంఘాలు ఉన్నవి.

## ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవులపై దాడి

**హైదరాబాద్, ఆగష్టు 12 :** ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ శివారు ప్రాంతమైన యల్.బి.నగర్‌లోని ఇమ్మానుయేల్ మందిరంపై స్థానిక హైందవ దుండగులు దాడిచేసి ప్రార్ధనలకు ఆటంకం కలిగించారు.

యల్.బి.నగర్‌లో నివాసముంటున్న పాస్టర్. యేసుపాదం ఇమ్మానుయేలు మందిరం అనే చర్చిని సుమారు పది సంవత్సరాలనుండి నడిపిస్తున్నాడు. గత రెండు సంవత్సరాల నుండి నూతనంగా నిర్మించిన భవనంలో ప్రార్ధనలు జరిపిస్తున్నారు. 6వ తారీఖున మందిరం దగ్గరలో నివశించే తిరుపతయ్య అనే అతను స్థానికంగా ఉండే క్రైస్తవ వ్యతిరేకతలను పోగుచేసి ప్రార్ధన మందిరంపై దాడిచేసి ప్రార్ధనలకు ఆటంకం కలిగించారు. ఆ తరువాత పోలీస్ స్టేషన్‌లో పాస్టర్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసులు మరియు స్థానిక పాస్టర్స్ యూనియన్ నాయకులు స్థానికులతో పాస్టర్‌తో ఆగష్టు 25న ఒక సమావేశం నిర్వహించి పరిష్కరించుకోవాలని నిర్ణయించినట్లు తెలియవచ్చింది.

## నల్గొండలో పాస్టర్‌పై దాడి

**నల్గొండ, ఆగష్టు 7 :** ఫ్లోరైడ్ భూతంతో విలవిలలాడుతున్న నల్గొండలో ఈ సంఘటన జరిగింది. పాస్టర్ పి. ఆంజనేయులు అతని కుటుంబసభ్యులు, నల్గొండ జిల్లా రాజాపేటలో సుమారు 350-400 మంది ఉన్న గుంపు చేతిలో దాడికి గురయ్యారు. వివరాలు పరిశీలిస్తే మోత్కూరు మండలం, చౌడ్ల రామవరం గ్రామంలో ప్రేయర్ పవర్ చర్చ్ అనే చర్చిని పాస్టర్ పి. ఆంజనేయులు నడిపిస్తున్నారు. పాస్టర్‌గారు కుటుంబంతో కలసి కారులో బొందుగుల గ్రామం నుండి హైదరాబాద్ వెళ్తుండగా దారిలో అపరిచిత వ్యక్తి సహాయం అర్ధించగా వారు కారులో ఎక్కించుకున్నారు. అప్పటికే పాస్టర్‌గారి కుటుంబం కారులో క్రైస్తవ భక్తిగీతాలు వింటుండగా ఇది నచ్చని ఆ అపరిచితుడు వారికి అనుమానం రాకుండా రాజాపేటలోని హైందవ మత తీవ్రవాదులకు ఫోన్లు చేసినట్లు తెలిసింది. కారు రాజాపేటకు చేరగానే 350-400 మంది కారుపై దాడిచేసి అద్దాలు పగులగొట్టారు. పాటల ప్లేయర్‌ను పగులగొట్టారు. మిగిలిన వివరాలు తెలియవలసింది.